



కర్నూలు నగరంలో సిలువను ఊరేగిస్తున్న క్రైస్తవులు

రైతుల సేవ పట్టని మార్కెట్లు

- వసతుల కల్పనలో విఫలం - సేవా కార్యక్రమాలకు అందని నిధులు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

రైతుల పంట విక్రయాల ద్వారా కోట్ల ఆదాయాన్ని ఆర్జిస్తున్న మార్కెట్ యార్డులకు రైతుల సేవ పట్టడం లేదు. చాలా చోట్ల రైతులకు వసతులు కల్పించడంలో విఫలం అవుతున్నాయి. సేవా కార్యక్రమాలకు నిధులు అందకపోవడంతో వాటి ఊసే లేకుండా పోయింది...



మార్కెట్ యార్డులకు రైతులు తెచ్చిన పంట దిగుబడుల క్రయ విక్రయాల నిర్వహణ ద్వారా వ్యవసాయ మార్కెట్ యార్డులు కోట్లలో ఆదాయం ఆర్జిస్తున్నాయి. ఆదాయం వస్తున్నా రైతులను విస్మరిస్తున్నాయి. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 15 వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ)లు ఉన్నాయి. వీటిలో కర్నూలు, ఆదోని, ఎమ్మిగనూరు మార్కెట్ యార్డుల్లో క్రయ, విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. మిగతాచోట్ల సీజన్లో నామమాత్రపు విక్రయాలు జరుగుతున్నాయి. 2019 నుంచి ఇప్పటి వరకు జిల్లాలోని 7 వ్యవసాయ మార్కెట్ల పరిధిలో రూ.150 కోట్లకు పైగా ఆదాయం వచ్చింది. ఉమ్మడి జిల్లాలోని వ్యవసాయ విపణుల్లో రైతులకు కనీస వసతులు కల్పించలేదు. కొన్నిచోట్ల రైతు విశ్రాంతి భవనాలు ఉన్నా నిర్వహణ లేక నిరుపయోగంగానే మారాయి. వర్తకులకు ప్రథమ చికిత్సలు అందించాల్సి ఉన్నా వాటి ఊసేలేదు. కర్నూలు వ్యవసాయ మార్కెట్లో ఏర్పాటు చేసిన రైతు సంజీవని వైద్యశాల ఏదేళ్లుగా మూతపడి ఉంది. పంట ఉత్పత్తులను మార్కెట్‌కు తీసుకొచ్చిన రైతులు అనారోగ్యం బారినపడితే ప్రథమ చికిత్సలు కూడా అందించలేని పరిస్థితి నెలకొంది. ప్రతి మార్కెట్ కమిటీ పరిధిలోని గ్రామాల్లో పశువైద్య శిబిరాలు నిర్వహించాల్సి ఉంది. పశు సంవర్ధకశాఖ సహకారంతో ఏడాది కాలంలో ఐదు శిబిరాలు నిర్వహించాలి. ఇందు కోసం రూ.లక్ష వరకు ఖర్చు చేయాల్సి ఉంది. గత ప్రభుత్వ హయాం నుంచి మార్కెటింగ్ శాఖ, వ్యవసాయ మార్కెట్ కమిటీలు పశువైద్య శిబిరాలకు స్వస్తి పలికాయి. 2019 నుంచి ఈ పశువైద్య శిబిరాలను పూర్తిగా ఆటకెక్కించారు. మార్కెట్ కమిటీల నుంచి రూ. వందల కోట్లలో ఆదాయం వస్తున్నా రైతుల సంక్షేమం కోసం పైసా ఖర్చు చేయడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మరో వైపు వ్యవసాయ మార్కెట్ కమిటీల పరిధిలోని గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు అధ్వరంగా మారాయి. వ్యవసాయ మార్కెట్ కమిటీలకు వచ్చే ఆదాయం నుంచి పంచాయతీరాజ్ శాఖ ద్వారా గ్రామీణ రహదారులను అభివృద్ధి చేయాల్సి ఉంది. గత ప్రభుత్వంలో 2022లో ఒక్కసారి మాత్రమే మార్కెటింగ్ శాఖ ద్వారా గ్రామీణ రహదారులకు నిధులు మంజూరు చేశారు. తర్వాత నిధుల మంజూరు పూర్తిగా నిలిచిపోయింది.

రైతులకు వసతులు కల్పించాలి



రైతులు తెచ్చిన పంటల క్రయవిక్రయాల ద్వారా మార్కెట్ కమిటీలకు కోట్లలో ఆదాయం వస్తోంది. డబ్బులు వస్తున్నా రైతులకు వసతులు కల్పించడం లేదు. మార్కెట్ యార్డులలో రైతులకు అవసరమైన అన్ని వసతులనూ మార్కెట్ కమిటీలు కల్పించాలి. గోడౌన్లు, విశ్రాంతి భవనాలను అందుబాటులోకి తీసుకురావాలి.

- జి.రామకృష్ణ, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి.

క్రీస్తు మార్గం.. నీతి మార్గం...

- జిల్లాలో భక్తి శ్రద్ధలతో క్రిస్మస్

ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్

నీతినే బోధించి, నీతి మార్గంలో నడిచిన యేసుక్రీస్తును అనుసరించాలని, నీతిగా జీవించాలని పాస్టర్ జీవన్ ప్రతాప్ అన్నారు. స్థానిక ఆర్ఎస్‌రోడ్ లోని యెహోవా షమ్మా చర్చిలో పాస్టర్ బి స్టీవెన్ చార్లెస్, డాక్టర్ ఆర్.ప్రశాంతి స్టీఫెన్‌ల ఆధ్వర్యంలో జరిగిన క్రిస్మస్ ఆరాధనలో జీవన్ ప్రతాప్ పాల్గొని వాక్య సందేశం ఇచ్చారు. చర్చి గాయక బృందం జయంతి, హిప్సీ, శిరీష, సురేఖ, కల్యాణీ క్రిస్మస్ గీతాలను అద్భుతంగా ఆలపించారు. బిషప్ చర్చిలో బిషప్ సంతోష్ ప్రసన్న రావు వాక్య సందేశం ఇచ్చారు. హోసన్నా ప్రార్థనా మందిరంలో పాస్టర్ ఫ్రెడ్డీ పాల్ క్రిస్మస్ ప్రాశస్త్యాన్ని వివరించారు. సిక్యాంప్ లోని ప్రార్థనా మందిరంలో పాస్టర్ సజీవన్ క్రిస్మస్ సందేశం ఇచ్చారు. హోరేబు చర్చిలో పాస్టర్ సంసోనన్న దైవ సందేశం ఇచ్చారు. నగరంలో పలు చోట్ల క్రైస్తవులకు ఇతరులు శుభాకాంక్షలు తెలిపారు. పలు చర్చలలో పేదలకు, వస్త్రాలు దానం చేశారు.



క్రీస్తు సందేశం అందజేస్తున్న బిషప్ సంతోష్ ప్రసన్న రావు

మనుస్మృతి ప్రతుల దహనం

- మనిషిని పశువుల కంటే హీనంగా చూసే మనుస్మృతి
- అందుకే ఈ పత్రులను తగలబెట్టిన బాబాసాహెబ్
- రాజ్యాంగంలో సమాన హక్కులు కల్పించిన అంబేద్కర్
- దేశంలో మనస్మతి అమలుకు బిజెపి అడుగులు
- బిసి, ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీ సంఘాల నాయకులు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

బహుజనులను, మహిళలను పశువుల కంటే హీనంగా మనువు మనుధర్మంలో రాశారని, అందుకే మనుస్మృతిని ఆనాడు బాబాసాహెబ్ అంబేద్కర్ తగలబెట్టారని జాతీయ ఒబిసి సంఘం నాయకులు డాక్టర్ కంచర్ల హరిప్రసాద్ అన్నారు. గురువారం కర్నూలు పాత బస్టాండ్ వద్ద డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం ముందు మనస్మృతి, ఇవిఎం పత్రులను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్యులు రాసుకున్న మనస్మృతిలో సమానత్వం లోపించిం దన్నారు. ముఖ్యంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీల తో పాటు స్త్రీలను కూడా అణిచివేయాలనే ధోరణితో మనస్మృతిని రాసుకున్నారని చెప్పారు. అందుకే ఆనాడు డిసెంబర్ 25న మనస్మృతిని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ తగలబెట్టారని గుర్తు చేశారు. దేశంలో అన్ని వర్గాలకు తగిన ప్రాధాన్యత కల్పిస్తూ అంబేద్కర్ రాజ్యాంగాన్ని రాశారని, అయితే ఇప్పుడు దేశంలో మనస్మృతి అమలు చేసే దిశగా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. రాజ్యాంగం అమలు ప్రశ్నార్థకంగా మారుతుం దని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ మహిళా ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షురాలు పట్నం రాజేశ్వరి మాట్లాడుతూ మనస్మృతిని మహిళల పట్ల అణిచివేత ధోరణితో రాసారని చెప్పారు. మహిళా కేవలం వంటింటికే పరిమితమనేలా, బహుజనుల అణచివేతే లక్ష్యంగా రాశారని చెప్పారు. అనంతరం ఇంటలెక్చువల్ కలెక్టివ్ సంస్థ జిల్లా కన్వీనర్ ఎం.ఖధీరుల్ల మాట్లాడుతూ మనుషులను మనుషులుగా రాకుండా పశువుల కంటే హీనంగా చూసే విధంగా మనుస్మృతిని రాశారన్నారు. సొంత మతస్తులను ఎదగనీయకుండా హింసిస్తూ రాసిన మనస్మృతి ప్రపంచంలో ఏ దేశంలోనూ ఉండదన్నారు. ఈ కార్యక్రమంలో బిసి, ఎస్‌సి,ఎస్‌టి, మైనారిటీ సంఘాల నాయకులు శేషఫణి, నంది విజయలక్ష్మి, అడ్వకేట్స్ నరసింహ, కరుణాకర్, రచయిత ఎస్.డివి అజీజ్, రెడ్డిపోగు కళావతి, లక్ష్మీదేవి, పెరియార్‌రంగస్వామి, రామశేషయ్య, మేధావులు, ప్రజలు పాల్గొన్నారు.




ప్రతులను దహనం చేస్తున్న నాయకులు

జిల్లా రైతులకు జై కిసాన్

ఫౌండేషన్ పురస్కారాలు

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

అనంతపురం జిల్లాలో ఇటీవల జాతీయ రైతు దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన కార్యక్రమంలో ఆరు జిల్లాలకు చెందిన 16 మంది ఉత్తమ రైతులకు జైకిసాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పురస్కారాలు, అవార్డులు, ప్రశంస పత్రాలు అందజేశారు. ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన కల్లూరు మండలం ఉలింద కొండ గ్రామానికి చెందిన బెస్త శ్రీనివాసులు, ఓర్వకల్లు మండల కేంద్రానికి చెందిన మహిళ రైతు వై.పద్మావతమ్మ, నందికొట్కూరు మండలం కోళ్ల బాబాపురానికి చెందిన దేగ శ్రీనివాసులు యాదవ్ జై కిసాన్ పురస్కారాలు అందుకున్నారు. జైకిసాన్ ఫౌండేషన్ అధ్యక్షులు నాగమల్లి, ఓబులేసు, అనంతపురం వ్యవసాయ శాఖ జెడి ఉమామహేశ్వరమ్మ హార్టికల్చర్ శాఖ అధికారి ఉమాదేవి చేతుల మీదుగా ఉత్తమ రైతు అవార్డులు అందుకున్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని కర్నూలు నగరానికి చెందిన యాదవ హక్కుల పోరాట సమితి అధ్యక్షులు అయ్యన్న యాదవ్, రిటైర్డ్ ప్రిన్సిపాల్స్ వి.నాగేశ్వరరావు యాదవ్, జెవి కృష్ణయ్య యాదవ్ సంయుక్తంగా రైతు పురస్కారం పొందిన శ్రీనివాసులు యాదవ్‌ను ఘనంగా సత్కరించారు.





పురస్కారాలు అందుకుంటున్న రైతులు

ప్లాట్లు కొన్నాక పార్కు స్థలాలు అమ్ముతున్నారు

- పార్కులను కాపాడాలంటూ స్థానికుల నిరసన ప్రదర్శన
- ప్రస్తుత పాలకులైనా స్పందించాలి
- ఎఎస్ఆర్‌వై కాలనీ వాసులు, పిపిఎస్ఎస్ నాయకులు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు సమీపంలో నందికొట్కూరు రోడ్డు పక్కన ఎఎస్ఆర్‌వై రెసిడెన్సీ వేసిన వెంచర్ యజమానిపై చర్యలు తీసుకోవాలని కాలనీ ప్రజలు, పిపిఎస్ఎస్ నాయకులు కోరారు. అందమైన పార్కులు చూపించడంతో పాటు మసీదు, చర్చి, దేవాలయ స్థలాలు కేటాయిస్తామని చెప్పి ప్లాట్లను కొనుగోలు చేసి ఇండ్లు కట్టుకుంటున్న సందర్భంలో ఉన్న పార్కులను కూడా ప్లాట్ వేసి అమ్ముతూ చట్ట విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. వెంచర్ యజమానిపై చర్యలు తీసుకోవాల ని కాలనీ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు ఎం.అనిల్ కుమార్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఆర్.బాలకృష్ణ, అధ్యక్షులు ఎం. రాధికా రెడ్డి, పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు ఇరిగినేని పుల్లారెడ్డి, కమిటీ సభ్యులు ఎన్.పర్వీన్, ఎస్.లక్ష్మి, ఎం.విజయ గౌరీ డిమాండ్ చేశారు. పార్కు స్థలాలను కాపాడాలంటూ గురువారం పట్టణ పౌర సంక్షేమ సంఘం ప్రతినిధి బృందంతో కలిసి స్థానిక ప్రజలు కాలనీలో నిరసన ప్రదర్శన చేశారు. వారు మాట్లాడుతూ మూడు పార్కులు, చర్చి,గుడి, మసీదులతో పాటు కమ్యూనిటీ హాల్ కూడా నిర్మిస్తానని హామీ ఇచ్చిన వెంచర్ యజమాని మాట మార్చి ఉన్న పార్కులను కూడా ప్లాట్ వేసి అమ్ముకుంటున్నారని తెలిపారు. పార్కులను కాపాడాలని అధికారుల చుట్టూ తిరుగుతున్నా.. ఎవరూ స్పందించలేదని స్థానిక ప్రజలు విమర్శించారు. గత ప్రభుత్వంలో పాలకులు స్పందించలేదని, ప్రస్తుత పాలకులైన స్పందించి పార్కులను కాపాడడంతోపాటు అన్ని వసతులను ఏర్పాటు చేయాలని కోరారు. మహమ్మద్ యూనూస్, సిబి.వర్మ ,ఎస్. అన్వర్‌బాష, ఎం. నారాయణ, టి.సైఫుద్దీన్, జి.చంద్రయ్య, ఎస్.షబ్బీర్ పాల్గొన్నారు.



నిరసన ప్రదర్శన చేపడుతున్న కాలనీ వాసులు, పిపిఎస్ఎస్ నాయకులు

కొత్త పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ

జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్

జనవరి 2 నుండి 9 వ తేదీ వరకు నిర్వహించనున్న రెవెన్యూ గ్రామ సభల్లో కొత్త పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి ఒక ప్రకటన లో తెలిపారు. ఆయా గ్రామాల్లో నిర్దేశించిన రోజున రెవెన్యూ అధికారులు గ్రామ సభలు నిర్వహించి, కొత్త పట్టాదారు పాస్‌పుస్తకాలను పంపిణీ చేస్తారని కలెక్టర్ తెలిపారు. గతంలో పంపిణీ చేసిన భూ హక్కు పత్రాలను వెనక్కు ఇచ్చి కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలను అధికారులు పంపిణీ చేస్తారని కలెక్టర్ తెలిపారు. గ్రామాల్లో నిర్వహించనున్న గ్రామ సభల తేదీల గురించి రెవెన్యూ అధికారులు ముందుగానే తెలియచేస్తారని, ఆ రోజున రైతులు గ్రామ సభలకు హాజరై కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలను పొందాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

టెన్త్ పరీక్షలపై నేడు కలెక్టర్ సమీక్ష

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

జిల్లాలో టెన్త్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని అమలు చేస్తున్న వందరోజుల ప్రణాళిక అమలుపై జిల్లా కలెక్టర్ విస్తృతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి సుధాకర్ గురువారం తెలిపారు. కలెక్టరేట్లోని సునయన ఆడిటోరియంలో జరిగే ఈ సమావేశంలో జిల్లా, మండల స్థాయి అధికారులతో సమీక్షిస్తారని పేర్కొన్నారు.

న్యాయవ్యవస్థను లెక్క చేయని రెడ్‌బుక్ రాజ్యాంగం

-కోర్టు లో హాజరైన నిందితుడిని మఫ్టీలో ఎలా అరెస్ట్ చేస్తారు

-వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. ప్రభాకర్

ప్రజాశక్తి- కోడుమూరు



రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగానికి అంతం లేకుండా పోయిందని, చివరికి న్యాయ వ్యవస్థను లెక్క చెయ్యని విధంగా రాష్ట్రంలో రెడ్ బుక్ పాలన కొనసాగుతుందని వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.ప్రభాకర్ విమర్శించారు. ఒక కేసు విషయంలో బుధవారం పత్తికొండ కోరులో సరెండర్ పిటిషన్ దాఖలు చేసేందుకు హాజరయిన నిందితుడిని పోలీసుల ఎలా అరెస్ట్ చేస్తారని ప్రశ్నించారు. సరెండర్ పిటిషన్ పుటప్ ఐన తర్వాత పోలీసులు కోర్టు హాలులోకి దౌర్జన్యంగా వెళ్ళి నిందితుడిని బలవంతంగా లాక్కెళ్లి పోలీసు జీప్‌లో ఎత్తుకెళ్లడం సిగ్గుచేటని పేర్కొన్నారు. జ్యూడీషియల్ కస్టడీలో వున్న వ్యక్తిని ఎలా అదుపులోకి తీసుకున్నారని ప్రశ్నించారు. చట్టం కంటే కూడా రెడ్ బుక్ రాజ్యాంగానికి పోలీసులు ఎక్కువ విలువనిస్తున్నారన్నారు. మఫ్టీలో వెళ్ళి పోలీసులు కోర్టు హాల్ నుండి ఎలా లాక్కొని వచ్చి తమ అదుపులో పెట్టుకుంటారన్నారు. సుప్రీం తీర్పు ప్రకారం ఏ కేసులోనూ నిందితులను మఫ్టీలో అరెస్ట్ చేయరాదని నిబంధనలు వున్నా పత్తికొండ కోర్టులో సుప్రీం కోర్టు తీర్పును ఉల్లంఘించారన్నారు. రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగానికి విలువనిచ్చి చట్ట ఉల్లంఘనకు ప్రతి రోజూ పోలీసులు పాల్పడుతున్నారన్నారు. కోర్టు లో హాజరైన నిందితుడిపై దాడి చేసి కోర్టు హాల్లోనే బలవంతంగా అదుపులోకి తీసుకున్న పోలీసులపై జిల్లా ఎస్ పి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లాలో న్యాయవాదులు కోర్టులను బహిష్కరించాల్సిందిగా కోరుతున్నాం. ఈ సంఘటనపై హై కోర్టులో కూడా పిటిషన్ దాఖలు చేసి పోలీసులపై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేసి న్యాయ పోరాటం చేస్తామని పేర్కొన్నారు. కోర్టు ధిక్కరణకు పాల్పడిన పోలీసులను వెంటనే సస్పెండ్ చెయ్యాలని డిమాండ్ చేశారు. కోర్టు హాల్లోనే దాడికి పాల్పడి, బెదిరించిన పోలీసులపై వెంటనే కేసు నమోదు చెయ్యాలని జిల్లా ఎస్పిని కోరారు.

కగార్ వ్యతిరేక మీటింగుకు అనుమతి నిరాకరణ

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కల్లూరు మండలం బొల్లవరంలో నిర్వహించతలపెట్టిన కగార్ వ్యతిరేక మీటింగు నకు పోలీసులు అనుమతి నిరాకరించడం అప్రజామిక చర్యని బొల్లవరం గ్రామ ప్రజలు తీవ్రంగా నిరసించారు. గురువారం చంద్రరాజేశ్వరరావు భవన్ సిపిఐ ఎంఎల్‌కార్యాలయంలో ప్రభుత్వ చర్యను నిరసిస్తూ విలేకరుల సమావేశంలో కన్వీనర్ రామకృష్ణారెడ్డి అధ్యక్షత ఈ ప్రెస్ మీట్‌లో సిపిఐ, సిపిఐ(ఎం), పౌర హక్కుల సంఘం, రైతుకూలీ సంఘాలతో పాటు వివిధ ప్రజాసంఘాల నేతలు పాల్గొన్నారు. ముందుగా బొల్లవరం గ్రామ కమిటి అధ్యక్షులు రమణా రెడ్డి మాట్లాడుతూ ఈ నెల 23న సాయంత్రం తాము శాంతియుతంగా నిర్వహించ తలపెట్టిన ఆపరేషన్ కగార్ వ్యతిరేక ర్యాలీ, బహిరంగ సభను ప్రభుత్వం అప్రజాస్వామికంగా, ఫాసిస్ట్ ధోరణితో అడ్డుకున్నారన్నారు. ఈ చర్య ప్రజల భావ ప్రకటన స్వేచ్ఛను హరించడమే నన్నారు. అనంతరం సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామాంజనేయులు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ సంస్థల చేతుల్లో కీలుబొమ్మగా మారిపోయాయన్నారు. ఈ దేశ సంపదలను బడా పెట్టుబడిదారులకు కట్టబెడుతున్నాయని, వాటిని వ్యతిరేకిస్తున్న ఆదివాసీలను తీవ్ర వాదులుగా ముద్ర వేసి, బూటకపు ఎన్‌కౌంటర్లు చేస్తున్నాయని, బయటి సమాజం లోని వ్యక్తులకు ప్రభుత్వాలను విమర్శించే స్వేచ్ఛ కూడా లేకుండా చేస్తున్నాయన్నారు. తక్షణమే ఇలాంటి చర్యలను ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్.రాధాకృష్ణ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మరీ దుర్మార్గంగా వ్యవహరిస్తున్నాయన్నారు. తమ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రశ్నించే వారిపై మావోయిస్టులనే ముద్రవేసి, వారిని భౌతికంగా నిర్మూలిస్తున్నారని, దీనికి ఫలితం ప్రభుత్వాలు అనుభవిస్తాయని హెచ్చరించారు. విప్లవ రచయితల సంఘం నాయకులు పాణి మాట్లాడుతూ ఈ దేశ ప్రజాస్వామిక విలువలు తగ్గిపోతున్నాయని, రాజ్యాంగంపై ప్రమాణం చేసి, పదవులను చేపడుతున్న పార్టీలు రాజ్యాంగ వ్యతిరేకం గా వ్యవహరిస్తున్నాయన్నారు. పర్యావరణాన్ని విధ్వంసం చేస్తూ, ఈ దేశ సహజ వనరులను కార్పొరేట్ల కట్టబెడుతున్నాయని, అటువంటి సందర్భంలో ప్రజల తిరుబాటు తప్పదని, తక్షణమే ప్రజాసంక్షేమ వ్యతిరేక చర్యలను మానేయాలని హెచ్చరించారు. పౌర హక్కుల సంఘం జిల్లా కార్యదర్శి అల్లా బకష్ మాట్లాడుతూ ఎలాంటి కారణాలు, ఇబ్బందికరమైన పరిస్థితులు లేనప్పటికీ, బొల్లవరం గ్రామంలో కగార్ వ్యతిరేక మీటింగును భగ్నం చేయడం ప్రభుత్వం అప్రజాస్వామిక చర్యని, ప్రజలకు సభలు, సమావేశాలు నిర్వహించి ప్రభుత్వ విధానాల పట్ల తమ నిరసనను తెలియజేసే హక్కు ఉందన్నారు. రాయలసీమ విద్యావంతుల వేదిక కోకన్వీనర్ రత్నంఏసేపు, రైతుకూలీ సంఘం నాయకులు సుంకన్న, శేషగిరి, సిపిఐ నగర కార్యదర్శి రామకృష్ణారెడ్డి, సిపిఐఎం న్యూ సిటీ కార్యదర్శి రాముడు, సిఐటియు, ఎఐటియుసి బాధ్యులు మనోహర మాణిక్యం, చంద్రశేఖర్, బొల్లవరం గ్రామ కమిటి సభ్యులు పాల్గొని తమ నిరసనను తెలిపారు. ప్రజా సంఘం నాయకులు గాదె ఇన్నయ్యను ఉపా కేసు కింద అరెస్ట్ చేయడాన్ని ఖండించారు.

డోర్ డెలివరీ సేవలతో వినియోగదారులకు చేరువ

ప్రజాశక్తితో కర్నూలు ఆర్‌టిసి ఎటిఎం కమర్షియల్ కార్గో ఇన్చార్జ్ ఎల్ దీప్తిసృజన

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ కర్నూలు జిల్లా కార్గో పార్సెల్ సర్వీస్ ద్వారా డోర్ డెలివరీ ప్రచార మహోత్సవం సందర్భంగా వినియోగదారులకు దగ్గరవుతున్నామని కర్నూలు ఎటిఎం కమర్షియల్ కార్గో ఇన్చార్జ్ ఎల్ దీప్తిసృజన చెప్పారు. ఆమె ప్రజాశక్తితో మాట్లాడుతూ ఈనెల 20 నుండి 2026 జనవరి 19 వరకు డోర్ డెలివరీ మాసోత్సావాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆర్‌టిసి మీది మాది మన అందరిదని, ప్రజలతో మమేకమై రాత్రనక, పగలనక ప్రజాసేవలో నిమగ్నమై ప్రతి ఒక్కరూ తమ సొంత సంస్థగా భావిస్తున్నారు. భద్రతకు పెద్దపీట వేసి ప్రజలకు అందుబాటు ధరలతో రవాణా సౌకర్యాన్ని కల్పిస్తున్న ఆర్‌టిసి అంటే ప్రజలకు ఎనలేని అభిమానం. ప్రజా రవాణాలో అగ్రగామి అయిన ఎపిఎస్ఆర్‌టిసి సరుకుల రవాణా కూడా ప్రారంభించింది. పార్సెల్ కొరియర్ సేవలతో రాష్ట్రంలో ప్రజాకరణ పొందినది. సంస్థ ఏ పథకం ప్రవేశపెట్టినా ప్రజలు గొప్పగా ఆదరించారు. సరుకుల రవాణాలో మరో ముందడుగు వేసి ఇంటి వద్దకే సరుకుల రవాణా డోర్‌డెలివరీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం. రాష్ట్రంలోని 13 జిల్లాల ముఖ్య కేంద్రాలతో పాటు ప్రధాన నగరాలైన తిరుపతి, విజయవాడ, రాజమహేంద్రవరం తోపాటు 80 కేంద్రాలకు డోర్ డెలివరీ సౌకర్యం ఉంది. 50 కేజీల బరువు గల పార్సిల్ కూడా డోర్ డెలివరీ చేస్తాం. వినియోగదారులు పార్సిల్‌లో బుక్ చేసేటప్పుడు బుకింగ్ చార్జితోపాటు డోర్ డెలివరీ చార్జీలు కూడా చెల్లించి పార్సిల్ పొందు వారి చిరునామా, ఫోన్ నెంబర్, పిన్‌కోడ్ నెంబరు, డోర్ నంబర్ల వివరాలు తెలియజేసి డోర్ డెలివరీ సదుపాయాన్ని పొందవచ్చన్నారు.

మరిన్ని వివరాల కోసం ఎటిఎం కమర్షియల్ కర్నూలు సెల్ నెంబర్ 7331147270కు సంప్రదించాలన్నారు. కర్నూలు, అనంతపురం, కడప, చిత్తూరు, ప్రకాశం, నెల్లూరు, గుంటూరు, కృష్ణ, పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి, విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలోని ప్రధాన నగరాలకు కూడా ఎపిఎస్ఆర్‌టిసి కార్గో పార్సెల్ సర్వీస్ లను వినియోగించుకోవాలి. కార్గో సేవలు వినియోగించుకునేందుకు వినియోగదారులు కార్గో ఏజెంట్లు ట్రాఫిక్ ఇన్చార్జి నెంబర్లను సంప్రదించవచ్చు. కర్నూలు వన్ కార్గో ఏజెంట్ 7893677593, కర్నూలుటు కార్గో ఏజెంట్ 7032934555, ఎమ్మిగనూరు కార్గో ఏజెంట్ 9160075762, ఆదోని కార్గో ఏజెంట్ 8977761685, పత్తికొండ కార్గో ఏజెంట్ 8886757109 లకు లేదా ట్రాఫిక్ ఇంచార్జి నంబర్లు కర్నూలు వన్ 9505192303, కర్నూలు టు ట్రాఫిక్ ఇంచార్జ్ 9177983498, ఎమ్మిగనూరు ట్రాఫిక్ ఇన్చార్జి 7382873523, ఆదోని ట్రాఫిక్ ఇంచార్జి 7382869524, పత్తికొండ ట్రాఫిక్ ఇంచార్జ్ 7382874102. నెంబర్లకు సంప్రదించాలి. ఎపిఎస్ఆర్‌టిసి కార్గో సర్వీస్‌లను వినియోగించుకుందాం. మరింత బలోపేతం చేద్దాం అని ఎల్‌దీప్తి సృజన పిలుపునిచ్చారు.



ఎస్పి ఆదేశాలమేరకు డ్రంకెన్ డ్రైవ్ నిర్వహిస్తున్న పోలీసులు

రోడ్డు ప్రమాదాల నివారణకు డ్రంకెన్ డ్రైవ్

-ఎవరైనా మద్యం తాగి వాహనాలు నడిపితే జైలు శిక్ష తప్పదు

- ఎస్పి విక్రాంత్ పాటిల్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

రోడ్డు ప్రమాదాల నివారణకు కర్నూలు పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు ముమ్మరం చేశారని, 2025 జనవరి నుండి డిసెంబర్ 20 వరకు 9,025 డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేశారని జిల్లా ఎస్పి విక్రాంత్ పాటిల్ గురువారం తెలిపారు. మద్యం తాగి వాహనం నడపడం వల్లే రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. పోలీసులు పలు ప్రాంతాల్లో డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారు. ఎవరైనా మద్యం తాగి వాహనాలు నడిపితే అటువంటి వారిపై కేసులు నమోదు చేయడంతో పాటు ఒక నెల రోజుల పాటు జైలు శిక్ష ఉండే విధంగా గట్టి చర్యలు తీసుకుంటామని ఎస్పి తెలిపారు.



ఘనంగా సిపిఐ వందేళ్ల వేడుకలు

ప్రజాశక్తి-మద్దికేర : మద్దికెర మండ లం మదనంతపురం గ్రామంలో గురువారం సిపిఐ వంద సంవత్సరాల వేడుకలు ఘనంగా నిర్వహించారు. పార్టీ జెండాను ఎగురవేశారు. సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామచంద్రయ్య, జిల్లా నాయకులు రాజాసాహెబ్ మాట్లాడుతూ వంద సంత్సరాల నుండి సిపిఐ పేదల పక్షాన నిలుస్తూ ఎన్నో భూ పోరాటలు, పేదల ఇండ్ల స్థలాల కోసం పోరాటం చేసి పేదల పక్షాన నిలబడి పెత్తందారుల నియంతృత్వాన్ని ప్రశ్నించిన పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ అన్నారు. ఓట్లు, సీట్ల కోసం కాకుండా ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడేది సిపి అన్నారు. భారత స్వాతంత్ర్యోద్యమం, రైతాంగ సాయుధ పోరాటం, వేలాది ఎకరాల భూమి పేదలకు భూమి పంచడంలో సిపిఐ కీలక పాత్ర పోషించిందని అన్నారు. వందేళ్ళు పూర్తి చేసుకున్న సందర్భంగా పార్టీ శ్రేణులకు శుభాకాంక్షలు తెలుపుతూ పార్టీ కోసం ప్రాణాలర్పించిన త్యాగధనుల స్ఫూర్తితో ముందుకు సాగాలన్నారు. నిరుపేదలకు ఇళ్లు, రేషన్‌కార్డులు, పింఛన్లు దక్కే వరకు పేదల పక్షాన నిలబడి వీరోచిత పోరాటాలు నిర్వహించిన ఘన చరిత్ర సిపిఐదని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి అధ్యక్షులు రంగన్న, జిల్లా నాయకులు కారణ, సిపిఐ మండల కార్యదర్శి నాగరాజు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



దీక్షలో కూర్చున్న మహిళలు

జిల్లా సాధనకు 40వ రోజు దీక్ష

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని జిల్లా సాధన సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దీక్షలు గురువారం 40వ రోజుకు చేరాయి. ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పివి.పార్థసారథి ఆదేశాల మేరకు రిలే నిరాహార దీక్షలో మహిళలు కూర్చున్నారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ లలితమ్మ మాట్లాడారు. ఆదోని, ఎమ్మిగనూరు, పత్తికొండ, ఆలూరు, మంత్రాలయం తాలూకాలను కలిపి ఆదోని జిల్లా ఏర్పాటు చేసినప్పుడే పశ్చిమ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. ఆదోని జిల్లా అయితే విద్య, వైద్యం, వ్యవసాయం, సాగు, తాగునీరు అందుబాటులోకి వచ్చి కర్షక, కార్మిక, రైతులు అభివృద్ధి చెందుతారని చెప్పారు. ఎలాంటి పరిపాలన సౌలభ్యం పెరుగుతుందని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆలోచించి ఆదోని ప్రాంతం అభివృద్ధికి ఆదోనిని జిల్లాగా ప్రకటించాలని కోరారు. కౌన్సిలర్ పద్మావతి, రత్నా బాయి, వినీతా గుప్త, డి.సుశీలమ్మ, భాగ్యలక్ష్మి, ఉషారాణి, కామేశ్వరి, అంజలి, సుశీల, పద్మావతి, శ్యామల, ఈశ్వరి, తిమ్మక్క పాల్గొన్నారు.

ఆదోని జిల్లాతో పశ్చిమ ప్రాంతాభివృద్ధి

- ఎపివిబిఎస్ నాయకులు

ప్రజాశక్తి-ఆలూరు



దీక్షలనుద్దేశించి మాట్లాడుతున్న వరుణ్

జిల్లా పశ్చిమ ప్రాంతం అభివృద్ధి చెందాలంటే ఆదోనిని జిల్లా చేయాల్సిందేనని ఎపివిబిఎస్ (వాల్మీకి/బోయ) నాయకులు వరుణ్ డిమాండ్ చేశారు. గురువారం ఆదోని జిల్లా సాధన సమితి జెఎసి ఆధ్వర్యంలో 14వ రోజు చేపట్టిన దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పశ్చిమ ప్రాంతమైన ఆదోని, ఆలూరు, పత్తికొండ, మంత్రాలయం, ఎమ్మిగనూరు ప్రజలు ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్లేందుకు పేరుగాంచిందని తెలిపారు. అభివృద్ధిలో వెనుకబడిన ప్రాంతాన్ని జిల్లా చేయకుండా ప్రభుత్వాలు, పాలకులు నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించాడు. ఎపివిబిఎస్ జిల్లా అధ్యక్షులు ఎల్లార్తి అర్జున్, సీనియర్ నాయకులు వెంకటేశ్వర్లు, భాస్కర్ నాయుడు, పెద్దహ్యాట వీరేష్, రమేష్, కన్నయ్య, కురుకుంద శ్రీరాములు, ఆలూరు సురేంద్ర, వీరేష్, పెద్దకడబూరు మండల నాయకులు గురు, దేవేంద్ర, గిడ్డయ్య, సూరి ఉన్నారు.

ఆదోని మండలమే కావాలి

- టిడిపి సీనియర్ నాయకులు గోపాల్‌రెడ్డి

ప్రజాశక్తి - ఆదోని

కొత్తగా ఏర్పాటు కానున్న పెద్దహరివాణం మండలంలో తమ గ్రామాలను విలీనం చేస్తే చూస్తూ ఊరుకోబోమని టిడిపి సీనియర్ నాయకులు చిన్నగోనెహల్ గోపాల్ రెడ్డి, బసాపురం రామస్వామి, నారాయణపురం షేక్షావలీ తెలిపారు. పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద 16 గ్రామాల ప్రజలు చేపట్టిన దీక్ష గురువారం నాలుగో రోజుకు చేరింది. 16 గ్రామాల నుంచి మహిళలు తరలివచ్చి దీక్షలో కూర్చున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఆదోని తమ గ్రామాలకు అనుకూలంగా ఉందని, అభిప్రాయాలు తెలుసుకోకుండానే అధికారులు విలీన ప్రక్రియ మొదలు పెట్టడం సమంజసం కాదని తెలిపారు. ఏ సందర్భంలోనూ పెద్దహరివాణంలో తమ గ్రామాలను విలీనం కానీయమని తేల్చి చెప్పారు. 'పెద్ద హరివాణం వద్దు.. ఆదోని ముద్దు' అంటూ దీక్ష శిబిరంలో నినాదాలు చేశారు. ధణాపురం మల్లికార్జున, మదిరే గోవిందు, తిక్కన, కడితోట వీరేష్, గనేకల్ ఉరప్ప, శేషన్న, సంతేకుడ్లూరు ఎల్లప్ప, బలాదూరు హుసేని, రాముడు, ప్రసాద్, హెచ్.లింగప్ప, శ్రీనివాస్ ఉన్నారు.

బీటీ.నాయుడుకు వినతి : పెద్దహరివాణం మండలంలో గనేకల్లు, మదిరే, కడితోట, చాగి, ధణాపురం, నారాయణపురం, చిన్నగోనెహల్, చిన్నహరివాణం, తదితర 16 గ్రామాల విలీన ప్రక్రియకు అడ్డుకట్ట వేయాలని అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని ఎమ్మెల్సీ బీటీ.నాయుడుకు వినతిపత్రం ఇచ్చారు. పెద్ద హరివాణం వెళ్లాలంటే 20 కిలోమీటర్లు దూరం అవుతుందని, విలీన ప్రక్రియను నిలుపుదల చేసి ఆదోని మండలంలోనే తమ గ్రామాలు ఉండేలా చూడాలని కోరారు.



దీక్షలో కూర్చున్న 16 గ్రామాల ప్రజలు

అసంపూర్తిగా ప్రభుత్వ భవనాలు

- ఒక ప్రభుత్వంలో మొదలుపెడితే.. మరో ప్రభుత్వంలో ఆగిపోవాల్సిందేనా..? - ప్రభుత్వ నిధులు వృథా

- పెండింగ్ బిల్లులు చెల్లించి నిర్మాణాలు పూర్తి చేయాలని మండల ప్రజల విజ్ఞప్తి

ప్రజాశక్తి - చిప్పగిరి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు అన్ని వసతులు సమకూర్చడానికి, వైద్యం, విద్య అందుబాటులో ఉండేందుకు రూ.కోట్లు వెచ్చించి ప్రభుత్వ భవనాల నిర్మాణాలు చేపడుతున్నాయి. నిర్మాణాలు మధ్యలో ఆగిపోయే పరిస్థితి నెలకొంది. చేసిన పనులకు బిల్లులు సకాలంలో రావడం లేదని కాంట్రాక్టర్లు ఆవేదన చెందుతున్నారు. ఇంకో పక్కన ప్రభుత్వం మారినప్పుడల్లా భవన నిర్మాణాలు ఆగిపోతున్నాయి. ఒక ప్రభుత్వం చేపట్టిన నిర్మాణాలను మరో ప్రభుత్వం చేపట్టకపోవడంతో అంతలోనే ఆగిపోయే పరిస్థితి ఏర్పడుతోంది. మండలంలోని అనేక గ్రామాల్లో సచివాలయాలు, ఆర్‌ఎస్‌కెలు, విలేజ్ క్లినిక్‌లు, పాఠశాలలో నాడు-నేడు పథకం కింద పాఠశాలల మరమ్మతులు, అదనపు గదుల నిర్మాణాలకు రూ.కోట్లు మంజూరు చేసి నిర్మాణాలు చేపడుతున్నారు. వాటిల్లో కొద్ది వరకు నిర్మాణాలు పూర్తయ్యాయి. ప్రారంభోత్సవం జరిగిన సచివాలయాల్లో విద్యుత్ కనెక్షన్, నీటి సరఫరా లేదనే కారణంతో అధికారులు విధులు నిర్వర్తించలేక నిరుపయోగంగా మారాయని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఉన్నతాధికారులు కూడా వీటిపై అంత ప్రాధాన్యత ఇవ్వలేక పోతున్నందునే ఈ సమస్య ఏర్పడిందని తెలిసింది. ఆగిపోయిన వాటిలో రామదుర్గం, బెల్డోన, డేగలహాల్, గుమ్మనూరు ఉన్నాయని అధికారులు పేర్కొంటున్నారు. నేమకల్లు గ్రామంలో 90 శాతం పూర్తయిన రైతు సేవా కేంద్రం 10 శాతం పనులు మాత్రమే పెండింగ్‌లో ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ఆ 10 శాతం పూర్తయితే రైతు సేవా కేంద్రం అందుబాటులోకి వస్తుంది. చిప్పగిరి పాఠశాలలో నాబార్డ్ పథకం కింద అదనపు గదుల నిర్మాణానికి నిధులు మంజూరు చేయగా ప్రజాప్రతినిధులు ఆర్భాటంగా భూమి పూజ చేశారు. అక్కడ పునాదుల వరకే పిల్లర్లు వేసి వదిలేశారు. దౌల్తాపురంలో విలేజ్ క్లినిక్‌ను స్లాబ్ వరకు నిర్మించి వదిలేశారు. ఇప్పటికైనా ప్రభుత్వ నిధులు వృథా కాకుండా.. ఆగిపోయిన నిర్మాణాలను పూర్తి చేసి, ప్రజలకు అందుబాటులోకి తేవాలని మండల ప్రజలు కోరుతున్నారు.




దౌల్తాపురం గ్రామంలో అసంపూర్తిగా ఉన్న భవనం



మధ్యలోనే ఆగిపోయిన నిర్మాణం

విడతల వారీగా పూర్తి చేస్తాం

- పిఆర్ ఎఇ సోమప్ప



అసంపూర్తిగా ఆగిపోయిన ప్రభుత్వ భవన నిర్మాణాలన్నింటినీ విడతల వారీగా పూర్తి చేస్తాం. అసంపూర్తిగా ఉన్న భవనాల వివరాలను ప్రభుత్వానికి నివేదించాం. విడతల వారీగా పూర్తి చేసేందుకు నిధుల మంజూరుకు ప్రభుత్వం కూడా సిద్ధంగా ఉంది. మంజూరైన వెంటనే నిర్మాణాలను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తాం.

గిరక పోటీల్లో కోటకొండ ఎద్దులు గెలుపు

- బహుమతులు అందజేసిన జిల్లా ఉపాధ్యక్షులు చంద్రశేఖర్

ప్రజాశక్తి - నందవరం

క్రిస్మస్ సందర్భంగా మండలంలోని మాచాపురం గ్రామంలో ఎద్దుల గిరక పోటీలను ఎమ్మెల్యే బీవీ.జయనాగేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు టిడిపి మండల అధ్యక్షులు ఖాసీం వలీ ఆధ్వర్యంలో నిర్వహించారు. వివిధ రాష్ట్రాల నుంచి ప్రజలు ఎద్దులను పోటీలో ప్రదర్శించారు. పి.కోటకొండ గ్రామానికి చెందిన ఎద్దులు ప్రథమ స్థానాన్ని సాధించాయి. గిరక పోటీల్లో విజయం సాధించిన ఎద్దుల యజమానులకు టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు భాస్కర్ల చంద్రశేఖర్ గురువారం బహుమతులు అందించారు. మొదటి స్థానం సాధించిన పి.కోటకొండ ఎద్దుల యజమానికి రూ.20 వేలు, రెండో బహుమతి లచ్చుమారి గ్రామం రూ.15 వేలు, మూడో స్థానం సాధించిన హనుమాపురం రూ.10 వేలు, నాలుగో స్థానం సాధించిన గుడికల్లు రూ.8 వేలు, ఐదో స్థానం సాధించిన గద్వాల జిల్లా గట్టు గ్రామం రూ.5 వేలు, ఆరో స్థానం సాధించిన మాచాపురం గ్రామానికి చెందిన ఎద్దుల యజమానులకు రూ.3 వేల నగదు బహుమతి అందించారు. నందవరం ఎస్ఐ తిమ్మారెడ్డి, టిడిపి మండల కన్వీనర్ ఖాసీంవలీ, సీనియర్ నాయకులు నడిపి పీర సాబ్, మాచాపురం ఎస్.బడేసాబ్, సద్దాం హుస్సేన్ పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న చంద్రశేఖర్

టిడిపి బలోపేతానికి కృషి

- నూతన కార్యవర్గం

ప్రజాశక్తి - ఆదోని

పార్టీ అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా అమలు చేస్తామని కొత్తగా నియామకమైన కార్యవర్గం నాయకులు ప్రకటించారు. గురువారం మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు, టిడిపి సీనియర్ నాయకులు ఉమాపతి నాయుడును కలిసి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా అధిష్టానం ప్రకటించిన కార్యవర్గంలో ఆదోనికి చెందిన వాల్మీకి రవి, కల్లుపోతుల రంగన్న, బిపి.బసవరాజు, అంజనమ్మ, మదిరే వీరేష్‌కు స్థానం కల్పించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు చేరేలా, పార్టీ ఆశయాలను ప్రజలకు వివరించి భాగస్వామ్యం చేస్తామని తెలిపారు. టిడిపి జిల్లా ట్రెజరర్ రవి మాట్లాడుతూ... మీనాక్షి నాయుడు సహకారంతో పార్టీ పెద్దలు అప్పజెప్పిన బాధ్యతలను నిర్వర్తిస్తామని, పార్టీ బలోపేతం కోసం కృషి చేస్తామని తెలిపారు.



ఉమాపతి నాయుడును కలిసిన నూతన కార్యవర్గం

క్రీడల్లో నైపుణ్యం పెంపొందించుకోవాలి

- వైసిపి రాష్ట్ర కార్యదర్శి సురేంద్రరెడ్డి

ప్రజాశక్తి - దేవనకొండ

గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులు క్రీడల్లో నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని వైసిపి రాష్ట్ర కార్యదర్శి సురేంద్ర రెడ్డి, కెడిసిసి మాజీ డైరెక్టర్ లుముంబా, సర్పంచి అరుణ్ కుమార్ తెలిపారు. క్రిస్మస్ సందర్భంగా తెర్నేకల్ గ్రామంలో గురువారం రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలను ప్రారంభించారు. పోటీలకు హాజరైన క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఎంపిటిసి నామాల శ్రీనివాసులు, ఉప సర్పంచి ఈరన్న, మాజీ ఎంపిటిసిలు రాఘవేంద్ర, వీరన్న, రాజు, నారాయణ, మాజీ ఉప సర్పంచి సత్య రాజు, పులి నరేష్ పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న నాయకులు



మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

ఫలించిన సిపిఎం పోరాటం

- ఎమ్మెల్యేకు, అధికారులకు కృతజ్ఞతలు

ప్రజాశక్తి - కౌతాళం

మండలంలోని ఎరిగేరి గ్రామంలో ఆర్‌డిటి స్వచ్ఛంద సంస్థ 100 ఇళ్లను కట్టించి పేదలకు ఇచ్చి, మౌలిక వసతులు మరిచిపోవడంతో సిపిఎం ఆధ్వర్యంలో పరిష్కరించాలని పోరాటం చేసినట్లు సిపిఎం సీనియర్ నాయకులు కె.మల్లయ్య, నాయకులు బి.ఈరన్న, వీరేష్ తెలిపారు. గురువారం వారు మాట్లాడారు. ఆర్‌డిటి కాలనీలో విద్యుత్ స్తంభాలు వేయాలని, తాగునీటి సౌకర్యం కల్పించాలని ఈ మధ్యకాలంలో ఎంపిడిఒ కార్యాలయాన్ని దిగ్బంధించి అధికారులను నిలదీసినట్లు తెలిపారు. మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి జోక్యం చేసుకొని ఎరిగేరి ఆర్‌డిటి కాలనీలో రోడ్లకు గరుసు వేసినందుకు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

భక్త జనసంద్రం.. మంత్రాలయం...

- స్వామివారి దర్శనార్థమై బారులు తీరిన భక్తులు

- ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేసిన అధికారులు

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలో కొలువైన రాఘవేంద్ర స్వామిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులతో మంత్రాలయం జనసంద్రంగా మారింది. గురువారం క్రిస్మస్ పండగ.. సెలవు కావడంతో స్వామి వారి దర్శనార్థమై దేశ నలుమూలల నుంచి భక్తులు లక్షల్లో తరలివచ్చారు. తుంగభద్ర నదీతీరం నుంచి వచ్చిన భక్తులకు కొత్తగా ఏర్పాటు చేసిన క్యూలైన్ ద్వారా దర్శన అవకాశం కల్పించారు. శ్రీమఠం ప్రధాన ఆర్చి నుంచి క్యూలైన్ ఏర్పాటు చేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. సేవాదారులకు, విఐపిలకు శ్రీమఠం మేనేజర్ ఎస్‌కె.శ్రీనివాసరావు, అసిస్టెంట్ మేనేజర్ ఐపి.నరసింహ మూర్తి, ధార్మిక అధికారి శ్రీపతి ఆచార్‌లు ప్రత్యేక దర్శన భాగ్యం కల్పించారు. గ్రామ దేవత మంచాలమ్మను, రాఘవేంద్ర స్వామి మూల బృందావనాన్ని దర్శించుకుని మంగళహారతులు స్వీకరించారు. భక్తులు శ్రీమఠం పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థుల ఆశీస్సులు పొందారు. దర్శనార్థమై వేచి ఉన్న భక్తులతో శ్రీమఠం కిక్కిరిసి పోయింది. శ్రీమఠం నిర్వహణలో ఉన్న శ్రీఅన్నపూర్ణ భోజనశాల, విఐపి భోజనశాల, బ్రాహ్మణ భోజనశాలలో భోజన సదుపాయం కల్పించారు.



ఆలయ ప్రాంగణంలో ఉన్న భక్తులు

ట్రాఫిక్ నియంత్రణకు పోలీసుల అవస్థలు

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలో ట్రాఫిక్ నియంత్రణకు పోలీసులు అవస్థలు పడ్డారు. గురువారం క్రిస్మస్ పండగ సందర్భంగా సెలవు కావడంతో రాఘవేంద్రస్వామి దర్శనార్థమై వివిధ ప్రాంతాల నుంచి వాహనాల ద్వారా భక్తులు మంత్రాలయం చేరుకోవడంతో రోడ్లు పార్కింగ్ స్థలాలుగా మారాయి. శ్రీమఠంలోని కారు పార్కింగ్ స్థలాలు వాహనాలతో పూర్తిగా నిండిపోయాయి. ఇక ఎమ్మిగనూరు, నాగలదిన్నె, రాయచూరు రోడ్లు కూడా వాహనాలకు పార్కింగ్‌గా మారాయి. సిఐ రామాంజులు, ఎస్ఐ మల్లికార్జున ఆధ్వర్యంలో పోలీసు సిబ్బందితో భద్రత కల్పించడంతో పాటు ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు చలికాలంలో కూడా ముచ్చెమటలు పట్టాయి. సిఐ రామాంజులు స్వయంగా రంగంలోకి దిగి అటు స్వామివారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులను శ్రీమఠం సెక్యూరిటీ సిబ్బందితో కలిసి నియంత్రించారు. మరోవైపు ప్రధాన కూడలి రాఘవేంద్ర సర్కిల్, శ్రీసుజయీంద్ర ఆరోగ్య శాల వద్ద లోపలకు వచ్చే వాహనాలను మళ్లించి ట్రాఫిక్‌ను తొలగించారు. సెలవులు వచ్చాయంటే చాలు ట్రాఫిక్ జామ్ కావడం, ట్రాఫిక్ నియంత్రణ పోలీసులకు తలకు మించిన భారంగా మారడం రివాజుగా మారింది. సిగ్నల్ లైట్లు ఏర్పాటు చేస్తే తప్ప ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించదు.




ఘనంగా క్రిస్మస్ సంబరాలు

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని నియోజకవర్గంలో క్రిస్మస్ సంబరాలు ఘనంగా జరిగాయి. విద్యుద్దీప అలంకరణతో చర్చిలు మెరిసిపోయాయి. పట్టణంలో గురువారం తెల్లవారుజాము నుంచి క్రిస్మస్ సంబరాలు మొదలయ్యాయి. క్రీస్తు పుట్టుక సూచికగా పశువుల పాక నమూనాను చర్చిల ఆవరణలో ఉంచారు. క్రిస్మస్ ట్రీ ఏర్పాటు చేసి అలంకరణ చేశారు. సిఎస్ఐ, బాల ఏసు మందిరం, సీయోను, బెరయ, కలవరి కొండ చర్చీల్లో పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. క్రీస్తు పుట్టుక గురించి పాస్టర్లు దేవదానం, దానియేల్ బాబు, ఆనంద్ రాజు వేర్వేరుగా వివరించారు. అనంతరం చర్చి ఆవరణలో భారీ కేక్ కట్ చేసి ఒకరికొకరు తినిపించుకున్నారు. **నందవరం** ఎస్సీ కాలనీలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. కాలనీవాసులు పండగను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉపాధి నిమిత్తం సంవత్సరమంతా వివిధ ప్రాంతాలకు వలస వెళ్లి జీవనం సాగిస్తున్న కాలనీవాసులు క్రిస్మస్ పండగ సందర్భంగా స్వగ్రామానికి చేరుకొని కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా జరుపుకున్నారు. కాలనీలోని మహిళలు, యువకులు, చిన్నారులు రంగురంగుల విద్యుత్ కాంతులతో ముస్తాబైన చర్చిలో సాయంత్రం క్రిస్మస్ భక్తిగీతాలు ఆలపిస్తూ.. ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం పాస్టర్ బిఎస్.ప్రసాద్ క్రీస్తు పుట్టుక ప్రాముఖ్యతను వివరించారు. **కౌతాళం,** ఎరిగేరి, హల్వి, గుడికంబాలి, కామవరం, బదినేహాల్ గ్రామాల్లో క్రిస్మస్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ప్రార్థన మందిరాలను సుందరంగా తీర్చిదిద్ది విద్యుద్దీపాలతో అలంకరించారు. ప్రతి ఇంటి వద్ద క్రిస్మస్ స్టార్లను ఏర్పాటు చేసి క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. అనంతరం క్రీస్తు జన్మ వృత్తాంతాన్ని పాస్టర్లు వివరించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఏసుక్రీస్తు గీతాలతో పిల్లల ప్రదర్శించిన పలుసాంస్కృతిక, ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. **కోసిగి** మండలంలోని సిఎస్ఐ, రోమన్ క్యాథలిక్, క్రీస్తు సంఘం, ప్రాజెక్ట్ క్రైస్ట్ ఆఫ్ ఇండియా చర్చీల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పాస్టర్లు రాజారత్నం, దేవదాసు, ప్రేమ్ కుమార్, ఫాదర్ జోజి, జాన్సన్ ప్రకాష్, శ్రీను, ఉమేష్‌లు మాట్లాడుతూ... క్రీస్తు పుట్టుక ఆవశ్యకతను వివరించారు. అనంతరం చర్చీలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. **హొళగుంద**లోని ఆయా చర్చీల్లో ప్రార్థనలు నిర్వహించారు. హొళగుంద పెనిహేలు ప్రార్థన మందిరంలో పాస్టర్ తిమోతి ఏసుక్రీస్తు గురించి బోధించారు. చర్చి పెద్దలు నాగప్ప, నందప్ప, ప్రసాద్ రావు పాల్గొన్నారు. **దేవనకొండ,** తెర్నేకల్, పొట్లపాడు, కోటకొండ, కప్పట్రాళ్ల, కరివేముల, పాలకుర్తి తదితర గ్రామాల్లో క్రిస్మస్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ప్రార్థన మందిరాలను విద్యుద్దీపాలతో అలంకరించారు. ఆయా గ్రామాల్లో క్రిస్మస్ వేడుకలు నిర్వహించి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. **చిప్పగిరి** సీయోను ప్రార్థన మందిరంలో క్రిస్మస్ వేడుకలను సంఘ పెద్దల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. చిప్పగిరి పాస్టర్లు టి.జయమ్మ, రాజు మాట్లాడారు. సాయంత్రం చిన్న పిల్లలు ఏసును పోలిన నాట్యాలు, కిడ్స్, తదితర వాటితో పెద్ద ఎత్తున సంబరాలు జరుపుకున్నారు. సంఘ పెద్దలు స్వామి దాసు, సంపత్ కుమార్, జోసఫ్ విజయ్ కుమార్, ఇశ్రాయేలు, సర్పంచి గోవిందరాజులు, లాజర్, ఏసేపు, బర్నబాసు, రాజ భూషణం పాల్గొన్నారు. **మంత్రాలయం**లోని సిఎస్ఐ చర్చిలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. రామచంద్ర నగర్ కాలనీలో సంఘ పెద్దల సమక్షంలో డివిజన్ చైర్మన్ రెవరెండ్ పాస్టర్ దేవదానం బాబు క్రీస్తు పుట్టుక గురించి వివరించారు. అనంతరం ప్రత్యేక పార్థనలు చేశారు. సంఘ పెద్దలు యోబు, ప్రభుదాసు, సుందర రాజు, దేవదాసు, కయ్యూన్ కుమార్ పాల్గొన్నారు.



ఆదోనిలో వాఖ్యోపదేశం చేస్తున్న దేవదానం



నందవరం



చిప్పగిరి



కౌతాళం



కోసిగి

విద్యతోనే ఉన్నత శిఖరాలు

- ఉషోదయ గ్రామీణ అభివృద్ధి సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు నాగరాజు

ప్రజాశక్తి - హొళగుంద

విద్యార్థి దశ నుంచే పట్టుదలతో విద్యనభ్యసిస్తే ఉన్నత శిఖరాలను చేరుకుంటారని ఉషోదయ గ్రామీణ అభివృద్ధి సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు సిహెచ్.నాగరాజు తెలిపారు. గురువారం స్థానిక సీజనల్ హాస్టల్‌లో ఈనెల 22న శ్రీనివాస్ రామానుజన్ జయంతి సందర్భంగా గణిత శాస్త్ర సబ్జెక్టుకు సంబంధించి ఉపాధ్యాయులు పోటీ పరీక్షలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పోటీ పరీక్షలు పట్టుదలను పెంచడమే కాకుండా తప్పొప్పులను తెలుసుకుని ముందుకు వెళ్లడానికి సహాయ పడతాయని తెలిపారు. విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణను అలవర్చుకొని.. కష్టంతో కాకుండా ఇష్టంతో చదివితే సాధ్యం కానిది ఏదీ ఉండదన్నారు. ఏదైనా అర్థం కాకపోతే ఎవరేమనుకున్నా పర్వాలేదు మౌనంగా ఉండకుండా ఉపాధ్యాయులతో చెప్పించుకోవాలని తెలిపారు. చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఉపాధ్యాయులు సోహెబ్, దుర్గయ్య, సీజనల్ హాస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాగరాజు

28న కైరుప్పలలో కంటి ఉచిత వైద్య శిబిరం

- బండ మీది వెంకటేశ్వర్లు సేవా సమితి సభ్యులు రమేష్

ప్రజాశక్తి - ఆస్పరి

మండలంలోని కైరుప్పల గ్రామంలో బండమీది వెంకటేశ్వర్లు సేవా సమితి ఆధ్వర్యంలో ఈ నెల 28న కర్నూలు శాంతిరాం కంటి ఆస్పత్రి సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సమితి సభ్యులు రమేష్, వీరేష్ తెలిపారు. గురువారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కంటి సమస్యతో బాధపడుతూ ఆపరేషన్ చేయించుకోవడానికి అవస్థలు పడుతున్న గ్రామీణ ప్రాంతాల ప్రజల ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కంటి సమస్యను నిర్లక్ష్యం చేయకుండా డాక్టర్ దగ్గరికి వెళ్లి చికిత్స చేయించుకోవాలని సూచించారు. ఆదివారం ఉదయం 10 గంటలకు కైరుప్పలలోని తేరు మండపం దగ్గర ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కంటి వైద్య శిబిరానికి ముఖ్య అతిథులుగా సిఐ గంగాధర్, సిపిఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య పాల్గొని ప్రారంభిస్తారని తెలిపారు. కంటి ఆపరేషన్‌కు ఎంపికైన వారిని క్యాంపు రోజే ఉచిత బస్సులో తీసుకెళ్లి మూడు రోజులు భోజనం వసతి ఏర్పాటు చేసి, తిరిగి బస్సులో ఉచితంగా ఇక్కడికి తీసుకొస్తారన్నారు. కంటి పరీక్ష కోసం వచ్చే వారు తప్పనిసరిగా ఆరోగ్యశ్రీ కార్డు, ఆధార్ కార్డు తీసుకురావాలని సూచించారు. సేవా సమితి సభ్యులు శేఖర్, సురేష్, ఓంకార్, రఫీ, సంతోష్, వీరేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సేవా సమితి సభ్యులు రమేష్

త్యాగానికి ప్రతీక.. క్రిస్మస్ : ఎమ్మెల్యే బీవీ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

క్రిస్మస్ పండగ త్యాగానికి ప్రతీక అని ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వర రెడ్డి తెలిపారు. గురువారం క్రిస్మస్ పండగ సందర్భంగా క్రైస్తవులకు శుభాకాంక్షలు తెలిపారు. పట్టణంలోని పంపన గౌడ్ కాలనీ, ఆర్‌కె కంటి వైద్యశాల దగ్గర సిఎస్ఐ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మండలంలోని గుడికల్ గ్రామంలో ఎమ్మిగనూరు వ్యవసాయ సహకార సంఘ సభ్యులు గుడేకల్ దేవదాసు స్వగృహంలో క్రిస్మస్ విందులో పాల్గొన్నారు. గుడికల్ ఫీల్డ్ అసిస్టెంట్ సుధాకర్ స్వగృహంలో క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్నారు. పట్టణంలోని ఎంబి చర్చిలో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే 7వ వార్డు అధ్యక్షులు, హాస్పిటల్ డెవలప్మెంట్ కమిటీ సభ్యులు అంబేద్కర్ స్వగృహానికి వెళ్లి క్రిస్మస్ విందులో పాల్గొన్నారు. ఎబిఎన్ విలేకరి శివ గృహంలో శుభాకాంక్షలు తెలియజేశారు. ఎమ్మిగనూరు కోఆపరేటివ్ టౌన్ బ్యాంక్ డైరెక్టర్ కదిరి కోట సామ్యేల్ స్వగృహానికి వెళ్లి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. బనవాసి గ్రామంలో ఎమ్మిగనూరు మార్కెట్ యార్డ్ డైరెక్టర్ అబ్రహాం స్వగృహానికి వెళ్లి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. టిడిపి నాయకులు కెటి.వెంకటేష్, జగదీష్, పట్టణ పార్టీ అధ్యక్షులు మహేష్, రామకృష్ణ, రంగస్వామి గౌడ్, మహేంద్ర బాబు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని ఎంబి చర్చిలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ ఎర్రకోట రాజీవ్ రెడ్డి, వైసిపి రాష్ట్ర కార్యదర్శి ఎర్రకోట జగన్ మోహన్ రెడ్డి పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఎర్రకోట రాజీవ్ రెడ్డి స్థానిక ఎంబి చర్చి పాస్టర్లకు పూలమాలలు వేసి, శాలువాలతో సన్మానించా రు. వైసిపి జిల్లా అధికార ప్రతినిధి కదిరి కోట సునీల్ కుమార్, జడ్పిటిసి భీమ్ రెడ్డి, యువనాయకులు ప్రభాకర్ పాల్గొన్నారు.



కదిరికోట సామ్యేల్ కుటుంబ సభ్యులతో ఎమ్మెల్యే బీవీ



క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న వైసిపి నాయకులు


వైసిపి సీనియర్ నాయకులు బుట్టా నీలకంఠంతో రేఖ నర్సింగ్ హోమ్ నిర్వాహకులు

అందుబాటులోకి ఆధునిక వైద్యం

- రేఖ నర్సింగ్ హోమ్ సదుపాయాలపై హర్షం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

రేఖ నర్సింగ్ హోమ్ నిర్వాహకులు ఆధునిక వైద్యం అందుబాటులోకి తీసుకురావడం పట్ల వైసిపి సీనియర్ నాయకులు బుట్టా నీలకంఠ హర్షం వ్యక్తం చేశారు. గురువారం రేఖ నర్సింగ్ హోమ్‌ను వైసిపి నాయకులతో కలిసి పరిశీలించారు. ఆస్పత్రిలో అందిస్తున్న వైద్య సేవలు, సౌకర్యాలు, చికిత్స విధానాలపై నిర్వాహకులతో వివరంగా చర్చించారు. పట్టణానికి తోడు నియోజకవర్గంలోని మారుమూల గ్రామాల నుంచి ఎమ్మిగనూరు నిరుపేదలు వైద్య చికిత్సల కోసం పట్టణానికి వస్తుంటారని పేర్కొన్నారు. అటువంటి వారికి వెసులుబాటుగా, అందుబాటులో ఉండే విధంగా నాణ్యమైన వైద్య సేవలు అందించాలని ఆస్పత్రి యాజమాన్యం డాక్టర్ కార్తీక్, డాక్టర్ రేఖ సింధూరని కోరారు. పేదలకు మెరుగైన చికిత్సలు అందిస్తూ ప్రజల మన్ననలు పొందాలని తెలిపారు. మున్సిపల్ వైస్ ఛైర్మన్ డి.నజీర్ అహ్మద్, వైసిపి పట్టణ అధ్యక్షులు కామర్తి నాగేశప్ప, బీసీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ముగతి విరుపాక్షి రెడ్డి, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి యుకె.రాజశేఖర్, జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శి కోరిశెట్టి మధుబాబు, బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు దొరబాబు నాయుడు, మైనారిటీ సెల్ ఉపాధ్యక్షులు మహబూబ్ బేగ్, సోషల్ మీడియా జిల్లా ఉపాధ్యక్షులు షేక్ చాంద్, పట్టణ ప్రధాన కార్యదర్శి గడ్డం అంజి, పట్టణ కార్యదర్శి గురువ మాబాష, మాజీ కౌన్సిలర్ చేనేత మల్లి పాల్గొన్నారు.

శ్రీమఠంలో ఘనంగా స్వర్ణ పల్లకోత్సవం

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలో కొలువైన రాఘవేంద్రస్వామి మఠంలో రాఘవేంద్రుని స్వర్ణ పల్లకోత్సవం ఘనంగా నిర్వహించారు. గురువారం శ్రీమఠంలో స్వర్ణ పల్లకి సేవ చేయించిన భక్తుల సమక్షంలో రాఘవేంద్రుని బృందావన ప్రతిమకు విశేష పూజలు నిర్వహించి మంగళ హారతులు ఇచ్చారు. అనంతరం బృందావన ప్రతిమను స్వర్ణ పల్లకిలో ఉంచి మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ శ్రీమఠం ప్రాకారంలో అర్చకులు వేదవ్యాస స్వామి, సహాయక పిఆర్ఒ హొన్నొళ్లి వ్యాసరాజ్ ఆచార్ ఆధ్వర్యంలో వైభవంగా సేవాదారులతో స్వర్ణపల్లకోత్సవం నిర్వహించారు. సేవాదారులతో భక్తులకు శ్రీమఠం పీఠాధిపతులు శ్రీసుభుధేంద్ర తీర్థులు ఫల, మంత్రాక్షితలు ఇచ్చి ఆశీర్వదించారు. శ్రీమఠం దివాన్, మేనేజర్ ఎస్‌కె.శ్రీనివాసరావు, ధార్మిక అధికారి శ్రీపతి ఆచార్, అసిస్టెంట్ మేనేజర్ పిఆర్ఒ ఐపి.నరసింహ మూర్తి పాల్గొన్నారు.

గెలుపోటములను సమానంగా తీసుకోవాలి

- కూటమి నాయకులు సతీష్ నాయుడు


బహుమతులు అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి - కౌతాళం

గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే ఆటల పోటీల్లో గెలుపోటములను సమానంగా తీసుకోవాలని నాయకులు పేర్కొన్నారు. క్రిస్మస్ సందర్భంగా గురువారం కౌతాళం మండలం హాల్వి గ్రామంలో క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్ నిర్వహించారు. కర్ణాటక, మాన్వి గ్రామానికి చెందిన రైనసీసి, ఇండియన్ సోల్జర్ జట్లు తలపడ్డాయి. రైనసీసి 93 పరుగులు చేయగా.. ఇండియన్ సోల్జర్ జట్టు 2 ఓవర్లు మిగిలి ఉండగానే విజయం సాధించింది. అనంతరం గెలిచిన జట్టుకు బహుమతి అందజేస్తూ, ఉత్తమ ఆటగాడికి, మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ ఆటగాడికి బహుమతులు అందజేశారు. ముఖ్య నాయకులు చిన్న సిద్ధయ్య, రామలింగన్న, ఈడిగ హనుమంతు, సోము, వీరేష్, జయరాం, నరసమ్మ పాల్గొన్నారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళం

ప్రజాశక్తి - కౌతాళం

ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శిరసంగి కాళికాదేవి ఆలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి కౌతాళానికి చెందిన భక్తుడు లక్ష్మణాచారి తనవంతుగా రూ.25 వేల విరాళాన్ని ఆలయ నిర్వాహకులకు అందజేశారు. గురువారం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దాతను నిర్వాహకులు శాలువా, పూలమాలలతో సన్మానించారు. అలాగే నాగ లింగయ్య తాత మఠానికి తనవంతుగా రూ.11 వేల విరాళం అందించారు.

మనువాదాన్ని అంతమొందించాలి

భారత హేతువాద సంఘాల నాయకులు

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

సమాజ తిరోగమన దిశగా పయనింపజేసే మనువాద సంస్కృతిని అంతమొందించాలని భారత హేతువాద సంఘాల సమాఖ్య జాతీయ ఉపాధ్యక్షులు, మూఢనమ్మకాల నిర్మూలన సంఘం రాష్ట్ర అధ్యక్షులు జెవి కృష్ణయ్య అన్నారు. గురువారం కర్నూలు నగరం, బిర్లా గేటు సమీపంలోని జ్యోతిరావుపూలే దంపతుల సర్కిల్‌లో ఆ సంఘాల ఆధ్వర్యంలో మనువాద బ్రాహ్మణీయ భావజాలాన్ని నిరసిస్తూ మనుస్మృతి ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సమాజంలో దళితులను అత్యంత హీనంగా దుర్మార్గంగా అణిచివేసే దిశగా బ్రాహ్మణీయ మనువాదుర్మార్గాలు సమాజాన్ని బలవంతంగా రుద్దారన్నారు. మనువాద సంస్కృతితో సమాజానికి పొంచి ఉన్న ప్రమాదాన్ని 150 ఏళ్ల క్రితమే జ్యోతిరావు పూలే దంపతులు గుర్తించారన్నారు. దీని నిర్మూలనకు విద్య ఒక ఏకైక మార్గంగా నడుం బిగించారన్నారు. అనంతరం అంబేద్కర్, పెరియార్ రామస్వామి నాయకర్ లాంటివాళ్ళు ఆత్మగౌరవం కుల నిర్మూలన వంటి అంశాలపై సమరశీల పోరాటాలు నిర్వహించారన్నారు. మనుస్మృతి భావజాల ప్రమాదాన్ని, మనుస్మృతి దుర్మార్గాన్ని ఎత్తిచూపడానికి, బహుజనులలో చైతన్యం రగిలించడానికి 1927 డిసెంబర్ 25 న మహారాష్ట్ర లోని కొల్హాపూర్ ప్రాంతంలో భీమాకోరేగావ్ దగ్గర వేల మంది సమక్షంలో మనుస్మృతి ప్రతులను తగులబెట్టి అంబేద్కర్ తన నిరసన తెలిపారు. ఆనాటికి ఈ నాటికి సమాజంలో కొన్ని మార్పులు వచ్చినా, ఇంకా ఈనాడు మన సమాజంలో మనువాద బ్రాహ్మణీయ భావజాలం రాజ్యమేలుతూనే ఉందని, సంఘ్ పరివార్ శక్తులు, బి.జె.పి. అధికారంలో మనువాద బ్రాహ్మణీయ భావజాలం బహుజనులను ఇంకా ప్రమాదంలోకి నెట్టుతూనే ఉన్నారు. ఈ కారణాల రీత్యా బహుజనులకు మనువాద బ్రాహ్మణీయ భావజాలం ప్రమాదాన్ని ఎత్తిచూపడానికి, సమాజాన్ని మేల్కొల్పడానికి డిసెంబర్ 25న కర్నూలు నగరంలోని బిర్లా గేట్ దగ్గర ఉన్న పూలే సర్కిల్ దగ్గర మనుస్మృతి ప్రతులను దహనం చేశామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.నాగభూషణం, ఆర్గనైజింగ్ సెక్రటరీ సివి.వర్మ, కార్యదర్శి ఎన్‌కె.జయన్న, జాతీయ బిసి సంక్షేమ సంఘం నాయకులు నక్కల మిట్ట శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, బ్యాంసెఫ్ నాయకులు హరిప్రసాద్, రామశేషయ్య, రంగస్వామి, రిటైర్డ్ ప్రిన్సిపాల్ వి.నాగేశ్వరావు, ఖదీర్, చైతన్యం శ్రీనివాసులు, అధిక సంఖ్యలో సభ్యులు, సంఘాల నాయకులు పాల్గొన్నారు.



మాజీ ఎంపిపి దేవరాజు కన్నీటి వీడ్కోలు

ఎమ్మెల్యే, కెడిసిసిబి ఛైర్మన్ హాజరు

ప్రజాశక్తి-సి బెళగల్

సి బెళగల్ మండల మాజీ ఎంపిపి పోలకల్ దేవరాజు (71) వయోభారంతో గురువారం తన నివాసంలో మృతి చెందారు. కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గులదస్తగిరి, కెబిసిసిబి ఛైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మణిగాంధీ నివాళ్ల అర్పించి అంతిమయాత్రలో పాల్గొన్నారు. దేవరాజు తనయుడు రాజకీయ నాయకులు అమర్‌ను కుటుంబాన్ని ఓదార్చి సానుభూతితెలిపారు. దేవరాజు సర్పంచుగా రాణించి ఎంపిపిగా మండలంలో ఎనలేని సేవలు అందించారన్నారు. సౌమ్యుడు, ఆదర్శప్రాయుడు అనీ కొనియాడారు. ఆయన మరణం కలచి వేసిందనిదిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ప్రముఖులు, జిల్లా నలుమూలల నుండి మండలంలోని గ్రామాల నుండి ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు, సర్పంచులు, ఎంపిటిసిలు, పలువురు అంత్యక్రియల్లో పాల్గొన్నారు.


దేవరాజు అంతిమయాత్రలో ఎమ్మెల్యే, కెడిసిసిబి ఛైర్మన్, స్థానికులు

రజక ఆకాంక్ష సభకు ఎంపీకి ఆహ్వానం

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

ఈ నెల 28న నంద్యాలలో నిర్వహించే రజక ఆకాంక్ష సభకు హాజరుకావాలని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజును రాష్ట్ర రజక కార్పొరేషన్ ఛైర్మన్ సావిత్రి ఆహ్వానించారు. సావిత్రి మర్యాదపూర్వకంగా కలిశారు. నగరంలోని ఎంపీ కార్యాలయంలో ఆయనను శాలువాతో సత్కరించింది. ఈ నెల 28న నంద్యాలలో నిర్వహించే రజక ఆకాంక్ష సభకు హాజరుకావాలని ఎంపీని ఆహ్వానించారు. అనంతరం రజకులు ఎదురుకుంటున్న సమస్యలను ఎంపీ నాగరాజు దృష్టికి తీసుకురాగా, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన తెలిపారు.



ఈ కార్యక్రమంలో రజక సంఘం నాయకులు పాల్గొన్నారు..

ఉపాధి హామీ చట్టం రక్షణకు చలో రాజ్ భవన్‌కు తరలండి

వ్యవసాయకర్మిక సంఘాల పిలుపు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కేంద్ర ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం మార్పు చేస్తూ పార్లమెంట్ లో బిల్లు ఆమోదం తీసుకొని విబిజి రామ్ జి స్కీమ్ గా మార్పును వ్యతిరేకిస్తూ ఈనెల 27న చలో రాజ్ భవన్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బి .వీరశేఖర్, ప్రధాన కార్యదర్శి కెవి. నారాయణ,వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కృష్ణ, ప్రధాన కార్యదర్శి నబీరసూల్ సంయుక్తంగా ఒక ప్రకటనలో తెలిపారు. మన జిల్లాలో ప్రతి సంవత్సరం ఐదు నుండి పది లక్షల వరకు వలసలు పోతున్నారని పేర్కొన్నారు. గ్రామీణ పేదలకు పట్టెడన్నం పెట్టే చట్టం దీన్ని నిర్వీర్యం చేస్తూ పార్లమెంటులో బిల్లు పెడితే మన రాష్ట్రంలో అధికార, ప్రతిపక్ష రాజకీయ పార్టీల పార్లమెంటు సభ్యులు 25 మంది పోటీ పడి ఆమోదం చేయడం దుర్మార్గమని అన్నారు. కరోనా కాలంలో గ్రామీణ పేదలు, అన్నివర్గాల ప్రజలకు తిండి పెట్టిందని,గ్రామీణ పేదలకు వరంగా ఉన్న ఈ చట్టాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని జిల్లా నుండి అధిక సంఖ్యలో గ్రామీణ పేదలు చలో రాజ్ భవన్ కార్యక్రమంలో పాల్గొనాలని తెలిపారు.

కురువలు అన్ని రంగాల్లో రాణించాలి

-ఎంపీ బస్తిపాటి నాగరాజు

ప్రజాశక్తి- కర్నూలు క్రైమ్


మాట్లాడుతున్న కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు

కురువలు అన్ని రంగాలలో రాణించాలని కర్నూలు ఎంపి బస్తిపాటి నాగరాజు అన్నారు. నగరంలోని పెద్దపాడు రోడ్డులో గల శ్రీ భీరలింగేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో కురువ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన 2026 క్యాలెండర్ ఆవిష్కరణ , నూతనంగా ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన కురువలకు సన్మాన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు... కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన వారిని సన్మానించిన ఎంపీ, అనంతరం నూతన క్యాలెండర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి కర్నూలు ఎంపీ టికెట్ బీసీలకు కేటాయించినప్పుడు, ఈ సారి వదులుకుంటే మరోసారి కురువలకు అవకాశం రాదన్న ఉద్దేశంతో, ఆ టికెట్ తెచ్చుకోవడానికి చాలా ఇబ్బందులు ఎదురుకున్నానన్నారు...తన కుల బాంధవులు కురువలందరూ ఏకదాటిగా మద్దతు తెలిపడంతోనే లక్షకు పైగా మెజార్టితో తో ఎంపీగా గెలుపొందానన్నారు. వచ్చే ఎన్నికల్లో కురువలకు జిల్లాలో ఒక ఎంపీ టికెట్ తో పాటు ఒక ఎమ్మెల్యే టికెట్ వచ్చేలా కృషి చేస్తానన్నారు. కురువలు రాజకీయంగా చైతన్యవంతులు కావాలని, రానున్న స్థానిక ఎన్నికల్లో ప్రతి స్థానానికి పోటీ పడాలన్నారు. ఇక ఈ సారి జిల్లా పరిషత్ ఛైర్మన్ పదవిని కురువలకు దక్కేలా ప్రతి ఒక్కరు కృషి చేయాలన్న ఎంపీ, కురువలు ఎదురుకుంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కురువ కార్పొరేషన్ డైరెక్టర్లు శ్రీనివాసులు, రామకృష్ణ, ఉమ్మడి కర్నూలు జిల్లా గొర్రెల పెంపకదారుల సహకార సంఘం ఛైర్మన్ శ్రీనివాసులు, కురువ సంఘం నాయకులు పాల్గొన్నారు.

రాజావర్ధన్ రెడ్డి జ్ఞాపకార్థం దుస్తుల పంపిణీ

జాశక్తి -కోడుమూరు

కోడుమూరు మండలం పరిధిలోని అనుగొండ గ్రామంలో క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని కీర్తి శేషులు రాజవర్దన్ రెడ్డి జ్ఞాపకార్థంగా 300 మంది మహిళలకు, 100 మంది పురుషులకు చీరలు, అంగీలు పంపిణీ చేశారు. కోడుమూరు మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో రాజవర్ధన్ రెడ్డి చిత్ర పటానికి పాలాభిషేకం చేసి, కేక్ కట్ చేసి అందరికీ దుస్తులు పంపిణీ చేశారు. ఆయన మండల ప్రజల సమస్యపై తపించిన తీరును, ప్రజల పట్ల చూపిన ఆదరాభిమాలను రామకృష్ణారెడ్డి వివరించారు. రాజవర్ధన్‌రెడ్డి ఆశయాలను కొనసాగిస్తామని, ఆయన చూపిన మార్గంలో నడుస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్వేశ్వరెడ్డి, మధుసూదన్ రెడ్డి, బోయ హనుమంతు, బోయ నాగమద్దయ్య, జగ్గయ్య, మాదిగ మౌలాలి, మాదిగ సుధాకర్, మాదిగ ప్రభుదాసు, మాదిగ నాగసేసులు, మాదిగ సుంకన్న, మాదిగ సుధాకర్ మాదిగ దేవదాసు, మాదిగ నాగేంద్ర పాల్గొన్నారు.



కురవల్లిలో కార్డెన్ సెర్చ్


తనిఖీలు చేస్తున్న పోలీసులు

ప్రజాశక్తి-బొమ్మనహాల్

అనంతపురం ఎస్పీ ఆదేశాల మేరకు గురువారం ఎస్ఐ నబిరసూల్ ఆధ్వర్యంలో పోలీసులు బొమ్మనహాల్ మండల పరిధిలోని కురవల్లి గ్రామంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఎస్ఐతో పాటు పోలీసులు ఉదయమే ఆ గ్రామం చేరుకుని పాతనేరస్తులు, అనుమానితుల ఇళ్లలో క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. అలాగే గడ్డి వాములు, చెట్లు, ముళ్లపొదలు, తదితర ప్రాంతాల్లో సోదాలు చేశారు. ఎస్ఐ నబిరసూల్ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలు శాంతి భద్రతలకు భంగం కలిగించకుండా ప్రశాంత జీవనం సాగించాలని సూచించారు.

వీధి దీపాల నిర్వహణలో నిర్లక్ష్యం..!

కొన్ని చోట్ల పగలూ వెలుగుతున్న లైట్లు - మరికొన్ని చోట్ల రాత్రివేళ చిమ్మచీకట్లు

ప్రజాశక్తి-రాయదుర్గం

అనంతపురం జిల్లా రాయదుర్గం పట్టణంలో వీధి దీపాల విషయంలో విచిత్రమైన పరిస్థితి నెలకొంది. పట్టణంలో పలుచోట్ల పగలు సైతం వీధి దీపాలు వెలుగుతూ ఉండగా మరికొన్ని ప్రాంతాల్లో అసలు వీధి దీపాలే లేక రాత్రిళ్లు అంధకారం నెలకొంటుంది. ప్రధాంగా చాలా వీధుల్లో కొత్తగా లైట్లు ఏర్పాటు చేయగా వాటిని ఆఫ్ చేసే వారు లేక రోజంతా వెలుగుతూనే ఉన్నాయి. ఇక ప్రధాన రహదారుల్లో పలు చోట్ల లైట్లు వెలగక రాత్రివేళ చిమ్మచీకట్లు అలుముకున్నాయి. దీంతో రాత్రి వేళ పాదచారులు, ప్రయాణికులు, వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇదివరకూ వీధి దీపాల నిర్వహణ బాధ్యత ప్రయివేటు ఏజెన్సీకి అప్పగించగా ఆ ఏజెన్సీతో ఇటీవల ఒప్పందం రద్దు అయింది. దీంతో అప్పటి నుంచి మున్సిపల్ ఇంజినీరింగ్ సిబ్బంది నిర్వహణను పర్యవేక్షిస్తున్నారు. కొన్నిచోట్ల సాయంత్రం చీకటి పడిన వీధి దీపాలు ఆన్ చేయకపోవడం, పగలు పొద్దెక్కిపోయినా లైట్లను ఆఫ్ చేయకపోవడం జరుగుతోంది. ఇకనైనా మున్సిపల్ అధికారులు స్పందించి వీధి దీపాల నిర్వహణ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించి ప్రజల ఇబ్బందులు తీర్చాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



ప్రేమను పంచిన క్రీస్తు సందేశం

-బిషప్ సంతోష్ ప్రసన్న రావు

ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్

ప్రేమ, సంతోషం, సమాధానం, ఐకమత్యమే క్రిస్మస్‌అనీ, క్రీస్తు ఈ లోకానికి ప్రేమను పంచడానికి వచ్చాడని, ఆయన మార్గంలో ప్రపంచమంతా నడుస్తే శాంతి నెలకొంటుందని నంద్యాల డయాసిస్ బిషప్ కామనూరి సంతోష్ ప్రసన్న రావు అభిప్రాయపడ్డారు. కర్నూలు ఎస్‌పిజి క్రైస్ట్ చర్చిలో క్రిస్మస్ పండుగ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో మాజీ టిజి. వెంకటేష్, రెవరెండ్ స్వరూప్ కుమార్, రెవరెండ్ భాస్కర్ పాల్గొన్నారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

మద్దికేర : మండలంలోని పలు గ్రామాల్లో గురువారం క్రిస్మస్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ప్రార్ధనా మందిరాలను సుందరంగా తీర్చిదిద్ది విద్యుత్ దీపాలతో అలంకరించారు. ప్రతి ఇంటి వద్ద క్రిస్మస్ స్టార్లను ఏర్పాటు చేసి భక్తి ప్రవర్తలతో క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. మండలంలోని మద్దికేర, గురుజుల అగ్రహారం హంప పెరవలి బాసినపల్లి ఎడవల్లి బొమ్మనపల్లి తదితర గ్రామాల్లో క్రిస్మస్ వేడుకలు నిర్వహించి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుతూ క్రిస్మస్ సంబరాలు జరుపుకున్నారు. కరుణ , ప్రేమ, దాతృత్వం, త్యాగం, ఇవన్నీ తన జీవితం ద్వారా మానవాళికి అందించారన్నారు. క్రీస్తు జన్మ వృత్తాంతాన్ని పాస్టర్లు వివరించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఏసుక్రీస్తు గీతాలతో పిల్లల ప్రదర్శించిన పలుసాంస్కత కార్యక్రమాలు ప్రజలను ఆకట్టుకున్నాయి.

ఊరూరా ఘనంగా క్రీస్తు జననం ప్రార్థనలు

సి బెళగల్ : ఊరూరా క్రీస్తు జననం ప్రార్థనలు ఘనంగా జరిగాయి. క్రీస్తు జననం పురస్కరించుకొని క్రిస్మస్ పండుగ సందర్భంగా చర్చిలను అలంకరించుకొన్నారు. ప్రతి ఒక్కరూ నూతన వస్త్రాలు ధరించి ఆలయాలలో చేరి మానవ శాంతి కోసం మంచి మార్గంలో నడిపించుట కోసం క్రీస్తు మానవుడిగా పుట్టి లోకానికి క్రిస్మస్ పండుగను తెచ్చారని పాస్టర్లు బోధించారు. ఇక్కడే వేడుకలు సంబరంగా జరిగాయి.




సి బెళగలో క్రిస్మస్ వేడుకలు


మద్దికేరలో క్రిస్మస్ వేడుకలు

అసాంఘిక కార్యకలాపాలను అణచివేస్తాం


బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్ఐ జి.మహేష్

ప్రజాశక్తి-కుందుర్పి

నూతన్ ఎస్ఐ బాధ్యతల స్వీకరణ

అనంతపురం జిల్లా కుందుర్పి మండలంలో అసాంఘిక శక్తుల ఆగడాలకు అడ్డుకట్ట వేయడానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని ఎస్ఐ జి.మహేష్ తెలిపారు. ఆయన గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో నూతన సబ్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ అసాంఘిక కార్యక్రమాలను ప్రోత్సహిం చినా, నిర్వహించినా కేసులు నమోదు చేస్తామన్నారు. గ్రామాల్లో ఎక్కడైనా అసాంఘిక కార్యక్రమాలు జరగుతుంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడే వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తామని చెప్పారు.

గతంలో కుందుర్పి ఎస్ఐగా పని చేసిన జి.నగేష్ కళ్యాణదుర్గం టౌన్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో నూతన ఎస్ఐగా మహేష్ వచ్చారు. బాధ్యతలు చేపట్టిన ఎస్ఐకు కానిస్టేబుళ్ళు శంకర్‌నాయక్, తిమ్మరాజు, బొమ్మయ్య, స్టేషన్ సిబ్బంది అభినందనలు తెలిపారు.

టిడిపి ఆధ్వర్యంలో క్రిస్మస్ సంబరాలు

ప్రజాశక్తి - ఆదోని


కేక్ కట్ చేసిన ఉమాపతి నాయుడు

టిడిపి క్రిస్టియన్ సెల్ జిల్లా కార్యదర్శి అమర్ ప్రకాష్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన క్రిస్మస్ సంబరాలకు ఎమ్మెల్సీ బీటీ.నాయుడు, టిడిపి సీనియర్ నాయకులు ఉమాపతి నాయుడు హాజరయ్యారు. భారీ కేక్ కట్ చేసి ఒకరికొకరు పంచుకుంటూ సంబరాలు చేసుకున్నారు.

రైతు సంక్షేమమే కూటమి ధ్యేయం : టిడిపి

ప్రజాశక్తి - నందవరం


యూరియాను పంపిణీ చేస్తున్న నాయకులు

రైతుల సంక్షేమమే కూటమి ధ్యేయమని టిడిపి నాయకులు తెలిపారు. గురువారం నందవరంలో రైతులకు యూరియాను పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ... రైతుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తోందని తెలిపారు. మండలంలో రైతులకు యూరియా కొరత లేకుండా ఎమ్మెల్యే బీవీ.జయనాగేశ్వరరెడ్డి కృషి చేస్తున్నారని చెప్పారు. ఆయన ఆదేశాల మేరకు గ్రామంలో యూరియా పంపిణీ చేశామన్నారు. అగ్రికల్చర్ మమత, టిడిపి గ్రామ అధ్యక్షులు భీమశేఖర్, నల్లంగి మల్లికార్జునగౌడ్, గడ్డం భీమన్న పాల్గొన్నారు.

టిడిపి రాష్ట్ర అధ్యకుని కలిసిన కృష్ణమ్మ


ప్రజాశక్తి - ఆదోని


పల్లా శ్రీనివాసరావు కలిసిన కృష్ణమ్మ

టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావును టిడిపి జిల్లా అధ్యక్షులు గుడిసె ఆది కృష్ణమ్మ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆమె మాట్లాడుతూ... జిల్లా అధ్యక్ష పదవితో మరింత బాధ్యత పెరిగిందని, నిబద్ధత మరింత బలపడిందని తెలిపారు. పార్టీ బలోపేతం, జిల్లా స్థాయిలో సంస్థాగత నిర్మాణం, కేడర్‌ను మరింత శక్తివంతం చేయడం, రానున్న రాజకీయ కార్యక్రమాలపై విస్తృతంగా చర్చించారు.

మహిళకు నిత్యావసర సరుకులు పంపిణీ

ప్రజాశక్తి- దేవనకొండ


తెర్నేకల్ గ్రామస్తులతో జనసేన డైరెక్టర్ సరోజ

తెర్నేకల్ గ్రామంలోని బోయ నరసింహులు భార్య బోయ లక్ష్మి గత కొన్ని రోజులుగా గర్భాశయ వ్యాధితో అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. దేవనకొండ జనసేన వీర మహిళ, ఆలూరు మార్కెట్ యార్డ్ డైరెక్టర్ సరోజమ్మ లక్ష్మి కుటుంబానికి తన వంతు సహాయంగా నిత్యావసర సరుకులు, బియ్యం ప్యాకెట్, వంటనూనె గురువారం సహాయం చేశారు. దేవనకొండ, తెర్నేకల్ జనసేన, టిడిపి నాయకులు విశ్రాంత ప్రధానోపాధ్యాయులు కటిక ఉచ్చీరప్ప, బి.చిన్న వెంకప్ప, లచ్చన్న, నాగేష్, రాముడు, భూసల రామాంజనేయులు, వడ్డే గోవిందు, పెద్దయ్య, బొడ్డు నాగరాజు, పరమేష్ పాల్గొన్నారు.



పప్పు శనగ పంటకు పచ్చ పురుగు

- దిగుబడి తగ్గుతుందని రైతుల ఆందోళన - నియోజకవర్గంలో 70 వేల ఎకరాలు సాగు

ప్రజాశక్తి - బనగానపల్లె

పప్పు సెనగ పంటకు పురుగు సోకడంతో పంట దిగుబడి తగ్గుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎన్ని మందులు పిచికారి చేసినా పురుగు ఉధృతి తగ్గడం లేదని రైతులు వాపోతున్నారు. బనగానపల్లె నియోజకవర్గంలో ఈ సారి పప్పు సెనగ పంటను 70 వేలా 185 ఎకరాల్లో రైతులు సాగు చేశారు. ఎన్నో ఆశలతో పప్పు శనగ పంట సాగు చేసినా వాతావరణంలో మార్పులు అన్నదాతను నట్టేట ముంచేలా ఉన్నాయి. ఎంతో శ్రమించి వేల రూపాయలు పెట్టుబడులు పెట్టి సాగు చేసిన పప్పు సెనగ పంటను పచ్చ పురుగు ఆశించింది. దీంతో పంట దిగుబడి తగ్గి పెట్టుబడి కూడా వచ్చేలా లేదని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.



శనగకు ట్రాక్టర్లతో మందు పిచికారి చేస్తున్న రైతులు

బనగానపల్లె నియోజకవర్గంలోని బనగానపల్లె మండలంలో 8,750 ఎకరాలు, కోవెలకుంట్ల మండలంలో 24,200ఎకరాలు, సంజామల మండలంలో 21,500 ఎకరాలు, కొలిమిగుండ్ల మండలంలో 9,735 ఎకరాలు, అవుకు మండలంలో 6000 ఎకరాల్లో పప్పుశనగ పంటను రైతులు సాగు చేశారు. పప్పు శనగ విత్తనం వేసే సమయంలో అధిక వర్షాలతో పొలంలో తేమ ఆరక రైతులు ఆలస్యంగా సాగు చేశారు. ఎకరానికి రూ.15000 పెట్టుబడి పెట్టారు. పంటకు పచ్చ పురుగు ఆశించి ఆకులను తినేస్తుంది. ఖరీదైన మందులు పిచికారి చేసిన నియంత్రణ కావడం లేదని రైతులు వాపోతున్నారు. శనగ పంట పూత దశలో ఉండగా పంటపై శనగపచ్చ పురుగు దాడి తీవ్రంగా ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. క్రిమిసంహారక మందులు వాడినప్పటికీ పూర్తిస్థాయిలో అదుపులోకి రావడం లేదని రైతులు తెలిపారు. నాలుగేళ్లుగా ఈ పంటకు గిట్టుబాటు ధర రావడంలేదని రైతులు తెలిపారు. క్వింటా 6 వేలకు మించకపోవడంతో తమకు గిట్టుబాటు కావడం లేదని రైతులు వాపోతున్నారు. పచ్చ పురుగుతో పంట దిగుబడి తగ్గి పెట్టుబడి పెరుగుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎకరాకి 8 క్వింటాళ్ల నుండి 10 క్వింటాల్ వరకు దిగుబడి రావాల్సి ఉంది. పచ్చ పురుగు ఆశించడం వల్ల 3,4 క్వింటాలు వచ్చే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సస్యరక్షణ చర్యలతో పచ్చ పురుగు నివారణ

- సుబ్బారెడ్డి, ఎఒ బనగానపల్లె



సస్యరక్షణ చర్యలతో శనగ పైరులో పచ్చ పురుగును అరికట్టవచ్చు. పచ్చ పురుగు నివారణకు ఫ్లూ బెండమైడ్ ఎకరానికి 125 గ్రాములు, ఇమామెక్టిన్ బెంజాయేట్ ఎకరానికి 90 గ్రాములు పిచికారి చేస్తే పచ్చ పురుగులు నివారించవచ్చు.

2న రైతులకు కొత్త పట్టాదార్ పాస్ పుస్తకాలు

- జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

రాష్ట్ర భూపరిపాలన ప్రధాన కమిషనర్ ఆదేశాల మేరకు తిరిగి సర్వే చేపట్టిన గ్రామాల్లో కొత్త పట్టాదార్ పాస్ పుస్తకాలను జనవరి 2 నుంచి 9 వరకు పంపిణీ చేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు. గురువారం ఆమె మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ భూమి, పట్టాదార్ పాస్ పుస్తకాలపై హక్కుల చట్టం 1971 ప్రకారం పునఃసర్వేలో భాగంగా రూపొందించిన కొత్త పట్టాదార్ పాస్ పుస్తకాల్లో రాజకీయ పార్టీల లోగోలు, పేర్లను తొలగించి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ చిహ్నాన్ని ముద్రించినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని అన్ని మండలాలు, గ్రామాల్లో సజావుగా పారదర్శకంగా పంపిణీ చేసేందుకు అధికారులను అప్రమత్తం చేసినట్లు పేర్కొన్నారు. కొత్త పట్టాదార్ పాస్ పుస్తకాల పంపిణీ సందర్భంగా జనవరి 2 నుండి 9 వరకు ప్రతి రెవెన్యూ గ్రామంలో గ్రామ సభలు నిర్వహించి అర్హులైన పట్టాదారులకు ఎటువంటి పొరపాట్లు లేకుండా పాస్ పుస్తకాలు అందజేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు కలెక్టర్ తెలిపారు.



పంపిణీ ప్రక్రియలో వెబ్‌ల్యాండ్ రికార్డులతో ముద్రిత పాస్ పుస్తకాలను పూర్తిగా క్రాస్ చెక్ చేయాలని, సంబంధిత పట్టాదారుల బయోమెట్రిక్ ధృవీకరణ ద్వారా మాత్రమే పాస్ పుస్తకాలు అందజేయాలని స్పష్టం చేశారు. ఇందు కోసం అవసరమైన బయోమెట్రిక్ పరికరాలు ముందుగానే అందుబాటులో ఉంచాలని సూచించారు. వీఆర్వోల ద్వారా ఆన్‌లైన్ ఈ- కైవైసీ అథెంటికేషన్ ఉపయోగించి పంపిణీ ప్రక్రియ చేపట్టాలన్నారు. లబ్ధిదారుల నుండి సరైన రసీదును రిజిస్టర్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని తెలిపారు. అలాగే పాత పట్టాదార్ పాస్ పుస్తకాలను తిరిగి సేకరించాల్సిందిగా కలెక్టర్ ఆదేశించారు. కొత్త పట్టాదార్ పాస్ పుస్తకాల పంపిణీపై గ్రామస్థాయిలో విస్తృత ప్రచారం కల్పించి, ప్రజా ప్రతినిధులు, లబ్ధిదారులు సహా అన్ని వాటాదారులకు షెడ్యూల్‌ను ముందుగానే తెలియజేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. జిల్లా వారీ పంపిణీ షెడ్యూల్‌ను ఈ నెల 30 నాటికి భూపరిపాలన ప్రధాన కమిషనర్ కార్యాలయానికి పంపించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమాన్ని అత్యంత ప్రాధాన్యతతో బాధ్యతాయుతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.

మల్లన్నను దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తి

ప్రజాశక్తి - శ్రీశైలం ప్రాజెక్ట్

ద్వాదశ జ్యోతిర్లింగాలలో ఒకటైన శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జునస్వామి వార్లను గురువారం రాత్రి ఆంధ్ర ప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి టి.మల్లికార్జునరావు దంపతులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ మర్యాదలతో అధికారులు, అర్చకులు స్వాగతం పలికారు. స్వామి అమ్మ వార్ల దర్శనానంతరం అమ్మవారి ఆశీర్వచన మండపంలో అర్చకులు వేద ఆశీర్వచనాలతో పాటు తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందజేశారు.



స్వాగతం పలుకుతున్న అధికారులు, అర్చకులు

ప్రజా వినతులను త్వరగా పరిష్కరించాలి

- మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి

ప్రజాశక్తి-బనగానపల్లె

ప్రజా సమస్యల పరిష్కారం కోసం వచ్చిన వినతులను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని అధికారులను రాష్ట్ర రోడ్లు, భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి ఆదేశించారు. గురువారం పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో వివిధ వర్గాల ప్రజల నుంచి వచ్చిన పలు విజ్ఞప్తులను మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ బాధితుల సమస్యలను సంబంధి త అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. న్యాయబద్ధంగా ఉన్న సమస్యలను సంబంధిత అధికారులతో అక్కడిక్కడే ఫోన్‌లో మాట్లాడి పరిష్కరించారు. ఎక్కువగా రెవెన్యూ సమస్యలు, ఫించన్లు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వంటి సమస్యలు ఆయన దృష్టికి రాగా ఆయా సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పట్టణ పరిధిలోని భానుముక్కలకు చెందిన 16వ వార్డులోని రాంభూపాల్ నగర్‌లో మౌలిక సదుపాయాల కల్పన అంశాన్ని మహిళలు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. తమ కాలనీలో రహదారులు, డ్రైన్లు, వీధి దీపాలు, తాగునీటి వంటి సమస్యలు ఉన్నాయని మంత్రికి తెలపగా... తక్షణం తాగునీటి సమస్యను పరిష్కరించాలని మంత్రి అధికారులు ఆదేశించారు. మౌలిక సదుపాయాలు కల్పన విషయంలో త్వరితగతిన ఆయా సమస్యలను పరిష్కరిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. మంత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ అర్జీల స్వీకరణ కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా వివిధ వర్గాల ప్రజలు, కూటమి నాయకులు, కార్యకర్తలు తరలి వచ్చారు.



వినతులను స్వీకరిస్తున్న మంత్రి బీసీ.జనార్ధన్ రెడ్డి

ప్రజాశక్తి ప్రజల పత్రిక : మంత్రి బీసీ

ప్రజాశక్తి - బనగానపల్లె

ప్రజాశక్తి దినపత్రిక ప్రజల పత్రిక అని రాష్ట్ర రోడ్లు భవనాలు పెట్టుబడులు మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ప్రజాశక్తి దినపత్రిక 2026 క్యాలెండర్‌ను మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి గురువారం ఆవిష్కరించారు. మంత్రి మాట్లాడుతూ ప్రజాశక్తి దినపత్రిక ప్రజా సమస్యలపై నిరంతరం వార్తలు రాస్తూ ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా పని చేస్తుందన్నారు. ఉద్యోగులు, కార్మికులు, కర్షకుల పక్షాన వార్తలు ప్రచురిస్తుందన్నారు. కార్యక్రమంలో నంద్యాల డివిజన్ ఇన్‌ఛార్జ్ మల్లికార్జున, టిడిపి వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షులు టంగుటూరి శీనయ్య, మిట్టపల్లి సర్పంచి తులసి రెడ్డి, యాగంటిపల్లె ఉప సర్పంచి బండి మౌళేశ్వరరెడ్డి, టిడిపి నాయకులు సంగు శంకేశ్వరరెడ్డి, మీరాపురం నారాయణరెడ్డి, ప్రజాశక్తి విలేకరులు జి.మద్దయ్య యాదవ్, సి. చంద్రశేఖర్, కోవెలకుంట్ల పుల్లయ్య, అవుకు శ్రీనివాసులు, కొలిమిగుండ్ల సురేష్ లింగాధర్, సంజామల ప్రసాద్ పాల్గొన్నారు.



ప్రజాశక్తి క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి బీసీ.జనార్ధన్ రెడ్డి

అప్పలరాజుపై పీడీ చట్టం ఉపసంహరించాలి

-కర్నూల్-గుంటూరు రహదారిపై సిపిఎం ఆందోళన

ప్రజాశక్తి - ఆత్మకూరు

రైతు నాయకులు, సిపిఎం అనకాలపల్లి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పల రాజుపై పెట్టిన పిడి చట్టంను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ.. ఆత్మకూరు పట్టణంలోని కర్నూలు-గుంటూరు రహదారిపై సిపిఎం నాయకులు గురువారం ఆందోళన చేపట్టారు. రైతు నాయకులు, సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం అప్పలరాజుపై అక్రమంగా బనాయించిన పిడి చట్టం కేసును వెంటనే ఉపసంహరించి, విడుదల చేయాలని సిపిఎం సీనియర్ నాయకులు ఎ.రాజశేఖర్, ఆత్మకూరు పట్టణ కార్యదర్శి ఎ.రణధీర్, మండల కార్యదర్శి పి.సుధాకర్‌లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణ నాయకులు డి.రామ్ నాయక్ అధ్యక్షతన సభ నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఉమ్మడి విశాఖపట్నం, ప్రస్తుతం అనకాపల్లి జిల్లాలో ప్రజల సమస్యలపై నిరంతరం పని చేస్తున్న ఆయనను చట్ట విరుద్ధంగా నిర్బందించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కార్పొరేట్లను సంతృప్తిపర్చడానికి రాష్ట్ర ప్రభుత్వం నిరంకుశ చర్యలకు పాల్పడుతోందన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో 2013లో నమోదైన కేసు, తాజాగా రాజయ్యపేట బల్క్‌డ్రగ్ పార్క్ కేసుల్లో ప్రభుత్వం అప్పలరాజును నిందితునిగా పేర్కొందన్నారు. అప్పలరాజును 19 కేసుల్లో రెండింటిలో కోర్టులు నిర్దోషిగా తేల్చగా, 12 కేసులు మూసివేయబడ్డాయని గుర్తు చేశారు. ఒక కేసు సివిల్ వివాదంగా ఖరారు చేయగా, మరో నాలుగు కేసులు దర్యాప్తులో ఉన్నాయని తెలిపారు. ఇందులో 151 సెక్షన్ కేసులే ఎక్కువన్నారు. అప్పలరాజును నిర్బంధించాలన్న దుర్బుద్ధితో నమోదు చేసిన అక్రమ పిడి చట్టం కేసు అని స్పష్టంగా అర్థమవుతోందని తెలిపారు. ప్రజల ప్రయోజనాలు, భూములు కోల్పోతున్న పేద రైతులు, అసైన్డ్ భూములు సాగు చేస్తున్న దళిత, గిరిజన బలహీనవర్గాల వారికోసం, వృత్తి, ఉపాధి కోల్పోయే వ్యవసాయ కార్మికులు, మత్స్యకారులు, ఇతర వృత్తిదార్ల ప్రయోజనాలు కాపాడడానికి అప్పలరాజు ఉద్యమాల్లో పాల్గొంటున్నారని గుర్తు చేశారు. పిడి చట్టం నోటీసులో పేర్కొన్నట్టు అప్పలరాజు భూకబ్జాదారు కాదని, కార్పొరేట్ల లాభాల కోసం సముద్రతీరాన్ని, పర్యావరణాన్ని విషతుల్యం చేస్తున్న ప్రయత్నాలను ఎండగట్టి రాజ్యాంగం, చట్ట ప్రకారం ప్రభుత్వం వ్యవహరించాలని ప్రజలను సమీకరిస్తున్నారే తప్పా ఎవరిపైనా గూండా గిరి చేయలేదన్నారు. ఏ పార్టీ అధికారంలో ఉన్నా అప్పలరాజు స్థానిక బాధితుల పక్షాన నిలబడ్డారని, పాలకులు కార్పొరేట్ సేవలో తరిస్తున్నారని విమర్శించారు. గంజాయి, ఎర్రచందనం, రేపిస్టులు, హ్యూమన్ ట్రాఫికింగ్ చేసేవారిని వదిలి నిజాయితీగా, నిస్వార్థంగా ప్రజల కోసం పోరాడుతున్న అప్పలరాజుపై పిడి చట్టం ప్రయోగించడం ప్రభుత్వ నిరంకుషత్వాన్ని నిదర్శనమన్నారు. విశాఖలో సిఐటియు అఖిలభారత మహాసభలు జరుగుతున్న నేపథ్యంలో అప్పలరాజును అరెస్టు చేయడం దుర్మార్గమన్నారు. తెలంగాణాలో చట్టవిరుద్ధంగా పిడి యాక్టు అనేక మందిపై ప్రయోగించడాన్ని తాజాగా సుప్రీంకోర్టు తప్పుబట్టిందన్న విషయం ప్రభుత్వం గుర్తించాలన్నారు. ఇటీవల కలెక్టర్ల సమావేశంలో సిఎం భూసేకరణకు అడ్డుపడేవారిపై పిడి యాక్టు ప్రయోగించమని ఆర్డరు జారీ చేసిందన్నారు. కలెక్టర్ ఆయనపై ఇప్పటి వరకు ఉన్న కేసులను పరిశీలించకుండా సంతకం పెట్టడం సరైంది కాదన్నారు. ప్రజా తంత్రవాదులు, వామపక్ష, లౌకిక పార్టీలు, ప్రజా సంఘాలు ప్రభుత్వ చర్యను ఖండిరచాలని, పిడి యాక్టు కేసును ఉపసంహరించేలా ఒత్తిడి చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పట్టణ నాయకులు ఏ. సురేంద్ర, జి. నాగేశ్వరావు, భాస్కర్, నాయకులు ఏ. కిరణ్, అంబయ్య, రఫిక్, మాలిక్, మూర్తుజా, అస్లాం, వలి, నాయక్, మల్లయ్య, సలాం, సాల్మన్, ఇస్మాయిల్ విజయ్, తదితరులు పాల్గొన్నారు.




కర్నూల్-గుంటూరు రహదారిపై ఆందోళన చేపడుతున్న నాయకులు

అప్పలరాజును వెంటనే విడుదల చేయాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి టి. రమేష్ కుమార్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

రైతు నాయకులు, సిపిఐ(ఎం) అనకాపల్లి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం. అప్పలరాజుపై అక్రమంగా బనాయించిన పిడి చట్టం కేసును వెంటనే ఉపసంహరించుకోవాలని, ఆయనను విడుదల చేయాలని సిపిఐ(యం) జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఉమ్మడి విశాఖపట్నం, ప్రస్తుతం అనకాపల్లి జిల్లాలో ప్రజల సమస్యలపై నిరంతరం పని చేస్తున్న ఆయనను చట్టవిరుద్ధంగా నిర్బందించడాన్ని సిపిఎం జిల్లా కార్యదర్శి టి. రమేష్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. ఫార్మా లాబీ, కార్పొరేట్లు కొమ్ముగాసి, వారిని సంతృప్తిపర్చడానికి రాష్ట్ర ప్రభుత్వం నిరంకుశ చర్యలకు పాల్పడుతోందన్నారు. ప్రజా సమస్యలపై పోరాడే నాయకులపై పిడి చట్టం కింద కేసులు బనాయించడం దుర్మార్గమైన చర్యగా ఆయన అభివర్ణించారు. రాష్టంలో గంజాయి, గుట్కా డాకాయిట్ల వంటి నేర ప్రవృత్తి కలిగిన వారిపైన బనాయించాల్సిన పిడి యాక్ట్‌ను ఉద్యమ కారులపైన పెట్టడం చూస్తుంటే రాష్ట్రంలో పోలీస్ రాజ్యం ఏలుతుందా అన్నట్లు ఉందన్నారు. తక్షణమే అప్పలరాజుపై అక్రమంగా పెట్టిన పిడి యాక్ట్‌ను ఉపసంహరించుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



అధిక బరువు గుర్తించే వాహనాన్ని ప్రదర్శిస్తున్న జహీర్

దక్షిణ భారత సైన్స్ ఫెయిర్‌కు ఆత్మకూరు విద్యార్థి

ప్రజాశక్తి - ఆత్మకూరు

స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థి ఎఎస్ జహీర్ రాష్ట్ర స్థాయి సైన్స్ ఫెయిర్‌లో అద్భుత ప్రతిభ కనబరిచి దక్షిణ భారత సైన్స్ ఫెయిర్‌కు ఎంపికయ్యారు. విజయవాడలోని మురళీ రిసార్ట్స్‌లో ఈ నెల 23 నుండి 24 వరకు నిర్వహించిన రాష్ట్ర స్థాయి విద్యా ప్రదర్శన నిర్వహించారు. ఇందులో జహీర్ 'ద్విచక్ర వాహనాల్లో అధిక బరువును గుర్తించి హెచ్చరించే వ్యవస్థ' అనే నమూనాను ప్రదర్శించారు. ఆటోమోటివ్ ఒకేషనల్ ట్రైనర్ షేక్ అబ్దుల్ కలాం పర్యవేక్షణలో ఈ ప్రాజెక్టును రూపొందించారు. మితిమీరిన లోడ్‌తో జరిగే ప్రమాదాలను అరికట్టేలా రూపొందించిన ఈ ఆవిష్కరణ సందర్శకులను, నిర్ణేతలను విశేషంగా ఆకట్టుకుంది. రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఈ ప్రాజెక్ట్ జనవరి 19 నుండి 23 వరకు హైదరాబాద్‌లో జరగనున్న దక్షిణ భారత సైన్స్ ఫెయిర్‌లో ప్రదర్శించడానికి ఎంపికైంది. ఈ సందర్భంగా కొత్తపల్లి ఎంఇఒ నాగరాజు ఫోన్ ద్వారా విద్యార్థి జహీర్‌ను అభినందిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు దేవానందన్ జహీర్‌ను, గైడ్ టీచర్ అబ్దుల్ కలాంను ప్రత్యేకంగా అభినందించారు. ఉపాధ్యాయులు మురళీకృష్ణ, మహబూబ్ బాషా, శివప్రసాద్, ఫైజుల్లాతోపాటు బోధన, బోధనేతర సిబ్బంది విద్యార్థి సాధించిన విజయాన్ని అభినందించారు. భవిష్యత్తులో జహీర్ మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని వారు ఆకాంక్షించారు.

సమాజానికి దిశా నిర్దేశం గురువులే

- సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో శేషఫణికి సన్మానం

ప్రజాశక్తి - నంద్యాల

విద్యా వ్యవస్థలో ప్రతిభావంతులైన ఉపాధ్యాయులను గౌరవించడం సమాజానికి స్ఫూర్తినిచ్చే అంశమని సాహితీ స్రవంతి నంద్యాల జిల్లా అధ్యక్షులు ఎం శ్రీనివాస మూర్తి అన్నారు. నంద్యాలలోని నంది రైతు సమాఖ్య కార్యాలయంలో సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో గురువారం ఆత్మీయ సన్మానసభను ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం అందుకున్న బలపనూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు అవ్వారి శేషఫణిని సాహితీ స్రవంతి అధ్యక్ష, కార్యదర్శులు ఎం. శ్రీనివాసమూర్తి, డాక్టర్ నీలం వెంకటేశ్వర్లు శాలువా, సన్మాన పత్రంతో ఘనంగా సత్కరించారు. శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ నేటి సమాజానికి శేషఫణి వంటి ఉత్తమ ఉపాధ్యాయుల సేవలు ఎంతో అవసరముందన్నారు. విశ్రాంత వ్యవసాయ శాస్త్రవేత్త కాదరబాద్ రవీంద్రనాథ్ మాట్లాడుతూ వృత్తి పట్ల నిబద్ధత, అంకితభావంతో పని చేస్తూ విద్యార్థులకు విలువలతో కూడిన విజ్ఞానాన్ని అందిస్తున్న శేషఫణి విజ్ఞానదీప్తిగా నిలిచారన్నారు. మాతృభాషా పరిరక్షణ సమితి అధ్యక్షులు డాక్టర్ దీవి హయగ్రీవాచార్యులు మాట్లాడుతూ విద్యార్థులను అన్ని రంగాల్లో తీర్చిదిద్దుతున్న ఉత్తమ సమాజ నిర్మాణ శక్తి శేషఫణి అని అన్నారు. మహానంది ఎంఇఒ రామసుబ్బయ్య మాట్లాడుతూ మహానంది మండలం గాజులపల్లెలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల ప్రగతికి ఆయన చేసిన సేవలు అందరికీ ఆదర్శప్రాయమన్నారు. నంద్యాల ఎన్‌జీఓ అధ్యక్షులు ఉశ్వేన్‌రెడ్డి మాట్లాడుతూ విద్యాభివృద్ధితోపాటు సామాజికాభివృద్ధి, సాహిత్యాభివృద్ధిలోను శేషఫణి చేస్తున్న సేవలు ప్రశంసనీయమన్నారు. నంది రైతు సమాఖ్య కార్యదర్శి కృష్ణారెడ్డి, వివిధ స్వచ్ఛంద సాహితీ సంస్థల ప్రతినిధులు అన్నెం శ్రీనివాసరెడ్డి, డాక్టర్ కిశోర్ కుమార్, గోపాల్, మణిశేఖర్ రెడ్డి, లలితా సరస్వతి, రామచంద్రమూర్తి తదితరులు అవార్డ్ గ్రహీత అవ్వారి శేషఫణి సేవలను గుర్తించి, గౌరవించటం సంతోషకరమన్నారు. ఈ సందర్భంగా 'సమాజానికి దిక్సూచి ఉపాధ్యాయుడు' అనే అంశంపై కవులు నరేంద్ర, మాబుబాష, నీలకంఠమాచారి, కొప్పుల ప్రసాద్, రఫీలు వినిపించిన కవితలు అందరిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సాహితీ స్రవంతి సభ్యులు రమేష్ బాబు, శివరామిరెడ్డి, సాహితీ మిత్రులు పాల్గొన్నారు.



రాష్ట్ర ఉత్తమ పురస్కారం పొందిన శేషఫణిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు



మంత్రిని కలిసిన రాయలసీమ గౌడ్ సంఘం నాయకులు, రైతులు

రెవెన్యూ మంత్రికి పవర్ గ్రిడ్ రైతుల వినతి

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల

కొలిమిగుండ్ల మండలంలో వివిధ గ్రామాల పవర్ గ్రిడ్ విద్యుత్ లైన్లో నష్టపోయిన రైతులు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్‌కు తన చాంబర్‌లో గురువారం వినతి పత్రం అందజేశారు. కొలిమిగుండ్ల మండలంలో 400 కెవి పవర్ గిడ్డు వాళ్ల రైతులపై చేస్తున్న దౌర్జన్యాల గురించి ఎలాంటి లాండ్ ఆక్టివేషన్ లేకుండా సొంత రెవెన్యూ భూములకు ఎలాంటి కాంబోజేషన్ లేకుండా వారు చేస్తున్న అరాచకాల గురించి రైతులు, మంత్రికి వివరించారు. స్పందించిన మంత్రి పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు రైతులు తెలిపారు. మంత్రికి వినతి పత్రమిచ్చిన వారిలో మండల రైతులతోపాటు రాయలసీమ గౌడ్ సంఘం నాయకులు కొండయ్య గౌడ్ తదితరులు ఉన్నారు.

ఎస్ఐ తిరుపాలు బాధ్యతల స్వీకరణ



ప్రజాశక్తి - పాములపాడు

పాములపాడు ఎస్ఐగా పి. తిరుపాలు గురువారం బాధ్యతలు చేపట్టారు. అనంతపురం జిల్లాకు చెందిన ఈయన గతంలో జూపాడుబంగ్లా మండల ఎస్ఐగా, ఇతర మండలాల్లోనూ పని చేశారు. ప్రస్తుతం బ్రాహ్మణకొట్కూరు పోలీస్ స్టేషన్ నుండి పాములపాడు ఎస్ఐగా బదిలీపై వచ్చారు. ఎస్ఐ మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలు, గొడవలు, అల్లర్లు చేస్తే ఎంతటి వారైనా ఉపేక్షించబోనని కఠినంగా వ్యవహరిస్తానన్నారు. శాంతి భద్రతల పరిరక్షణలో అందరితో కలిసి పని చేస్తానన్నారు.



ఎస్ఐను సన్మానిస్తున్న టిడిపి నాయకులు

ఎస్ఐకు టిడిపి నాయకులు సన్మానం

ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన పి.తిరుపాలును టిడిపి మండల కన్వీనర్- జి.రవీంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఎస్‌ను పూలమాల, శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌ఛార్జ్ హరినాథ్ రెడ్డి, రుద్రవరం సురేష్, తెలుగు యువత మండల అధ్యక్షుడు షేక్. కరీంబాష, మిట్టకందాల మాజీ సర్పంచి జి.హరిప్రసాద్ యాదవ్, సొసైటీల చైర్మన్లు రాయపాటి గోవిందు, లక్ష్మీకాంత రెడ్డి, లింగాల సర్పంచి మల్లీశ్వర రెడ్డి, స్వాములు, హఫీజ్, ఏర్వ.నాగలక్ష్మి రెడ్డి, లింగస్వామి,ఆదిరెడ్డి, ఉన్నం రాము, గజ్జెల భాస్కర్ రెడ్డి, శివశంకర స్వామి, రంగస్వామి, రమేష్ నాయక్, బాలస్వామి, కాంట్రాక్టర్ గోపాల్ పాల్గొన్నారు.

అలరించిన కళారూపాలు

ప్రజాశక్తి - శ్రీశైలం ప్రాజెక్ట్ : దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథంలో భాగంగా (నిత్యకళారాధన కార్యక్రమంలో భాగంగా) హైదరాబాద్‌కు చెందిన జి. పావనిదేవి బృందంచే గురువారం నిర్వహించిన సంప్రదాయ నృత్య కళారూపాలు అలరించాయి. ముందుగా గణపతికౌత్వం, నటేశకౌత్వం, శ్రీశైలం శివమయం, నమశ్శివాయతే, శంభో శివశంభో, కంజదలాయక్షి, శివాష్టకం తదితర గీతాలకు, అష్టకాలకు పావనిదేవి, దీపిక, వైష్ణవి, సహస్ర, వైశాలి నృత్య ప్రదర్శన చేశారు. ప్రాచీన కళల పరిరక్షణలో భాగంగా నిత్య కళారాధనలో హరికథ, బుర్రకథ, సంప్రదాయ నృత్యం, వాయిద్య సంగీతం, భక్తిరంజనిని దేవస్థాన నిర్వహించింది.





గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - మహానంది

గ్రామాల అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. మహానంది మండలం మసీదుపురం గ్రామంలో రూ.90 లక్షల నాబార్డు నిధులతో నూతనంగా నిర్మించిన బీటీ రోడ్డును టిడిపి క్లస్టర్ ఇన్‌ఛార్జీ మౌలీశ్వర్ రెడ్డి, మాజీ సర్పంచి నరాల జయచంద్రారెడ్డిల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే గురువారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో కేసీ కెనాల్ ప్రాజెక్టు ఛైర్మన్ బన్నూరు రామలింగారెడ్డి, కూటమి నేతలు, తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో వైసిపి నాయకుడు మృతి

ప్రజాశక్తి - రుద్రవరం

రుద్రవరం మండలంలోని మందలూరు గ్రామానికి చెందిన వైసిపి నాయకుడు శ్రీనివాసరెడ్డి(56) గుండెపోటుతో గురువారం మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామస్తుల వివరాల మేరకు.. శ్రీనివాసరెడ్డి గ్రామంలోని తన సన్నిహితులతో మాట్లాడి ఇంటికి వచ్చి గుండె నొప్పిగా ఉందని చెప్పి ఒక్కసారిగా కుప్పకూలిపోయాడన్నారు. మృతుడు శ్రీనివాసరెడ్డి భార్య నిర్మలమ్మ గ్రామ సర్పంచి కావడంతో గ్రామస్తులు కన్నీటి పర్యంతమయ్యారు. శ్రీనివాస రెడ్డి మృతి పట్ల పలువురు వైసిపి నాయకులు, కార్యకర్తలు ప్రగాఢ సానుభూతి తెలిపి నివాళులర్పించారు.

పురాతన బావి పూడికతీత పనులు

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల



పూడికతీత పనులను చేస్తున్న సిఐ

మండలంలోని నందిపాడు గ్రామంలో పురాతన బావిని పూడికతీత పనులను సిఐ రమేష్ బాబు గురువారం ప్రారంభించారు. గ్రామంలోని ప్రతి ఒక్కరి కృషితో పురాతన బావిని పూడిక తీతను చేసేందుకు ముందుకు రావడం అభినందనీయమని సిఐ అన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు లోకనాథ్ రెడ్డిపాల్గొన్నారు.

యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి - మిడుతూరు

మండలంలోని చింతలపల్లి గ్రామంలో యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం చోటుచేసుకుంది. వివరాలు.. చింతలపల్లి గ్రామానికి చెందిన ఆంజనేయులు, రమణమ్మకు మూడో సంతానమైన ఈశ్వర్(20) పొలంలోని చింత చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడని గ్రామస్తులు తెలిపారు. అతనికి మతిస్థిమితం లేక పొలం దగ్గరికి వెళ్లి చింత చెట్టుకు ఉరివేసుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

హిమాచల హాస్పిటల్ అధినేతకు బిసి ఇందిరా పరామర్శ

ప్రజాశక్తి - బనగానపల్లె



పట్టణానికి చెందిన హిమాచల్ హాస్పిటల్ అధినేత మంచాల చంద్ర మౌళీశ్వరరెడ్డి అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న టిడిపి నాయకురాలు బీసీ ఇందిరా రెడ్డి ఆయనను గురువారం పరామర్శించారు. పట్టణంలోని హిమాచల హాస్పిటల్లో చికిత్స పొందుతున్న మంచాల చంద్ర మౌళీశ్వర రెడ్డిని పరామర్శించి యోగక్షేమాలను తెలుసుకున్నారు.

కార్యకర్తల శ్రేయస్సుకు కృషి : బీసీ ఇందిరమ్మ



ప్రజాశక్తి - కొలిమిగుండ్ల

బీసీ కుటుంబానికి కార్యకర్తల అండే కొండంత బలమని, వారి శ్రేయస్సు కోసం బీసీ కుటుంబం అహర్నిశలు కృషి చేస్తుందని టిడిపి నాయకురాలు బీసీ ఇందిరమ్మ అన్నారు. కొలిమిగుండ్ల మండలంలోని కలవటాల గ్రామానికి చెందిన సర్పంచి కె సుమలత, కె కృష్ణ రంగారెడ్డి ఫంక్షన్ కొలిమిగుండ్లలోని రాంకో ఫంక్షన్ హాల్‌లో గురువారం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన బీసీ ఇందిరమ్మకు టిడిపి కృష్ణ రంగారెడ్డి దంపతులు ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. కార్యకర్తలను ఆప్యాయంగా పలకరించిన బీసీ ఇందిరమ్మ వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. కార్యకర్తలకు అన్ని విధాలా అండగా ఉంటామన్నారు. కృష్ణ రంగారెడ్డి కుమార్తెను ఆశీర్వదించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు మూలే రామేశ్వర్ రెడ్డి, హైవే పక్కర్ రెడ్డి, బనగానపల్లె నియోజకవర్గ కో కన్వీనర్ విఆర్ లక్ష్మిరెడ్డి, నంద్యాల రామేశ్వర్ రెడ్డి, అంబటి జయలక్ష్మి రెడ్డి, కోటపాడు శివరామిరెడ్డి, కొలిమిగుండ్ల సింగల్ విండో అధ్యక్షులు అంబటి వివేకానంద రెడ్డి, తెలుగు యువత మండల అధ్యక్షులు గొంగటి హుస్సేన్ రెడ్డి, తెలుగు యువత ప్రధాన కార్యదర్శి నంద్యాల ప్రసాద్ రామ్మోహన్ నాయక్, సత్య రెడ్డి, భాస్కర్ రెడ్డి, అమర్నాథ్ రెడ్డి, అందే రాము, టిడిపి మండల నాయకులు కేపీ వెంకటేశ్వర్లు, కే రామదాసు, హనుమంత, గుండా సింగల్ విండో ఉపాధ్యక్షులు వెంకటేశ్వరరావు, లోకనాథ్ రెడ్డి, రాజగోపాల్ యాదవ్, కళ్యాణ్ రెడ్డి, జి నాగేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

టిడిపి జిల్లా అధికార ప్రతినిధిగా షేక్ హుస్సేన్ బాషా

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ




ఆళ్లగడ్డ పట్టణానికి చెందిన కౌన్సిలర్ షేక్ హుస్సేన్ బాషకు నంద్యాల పార్లమెంట్ జిల్లా స్థాయి అధికార ప్రతినిధి పదవి వరించింది. ఎన్నో సంవత్సరాలుగా టిడిపికి, భూమా కుటుంబానికి అనుచరులుగా, అభిమానులుగా ఉంటూ వచ్చిన షేక్ హుస్సేన్ బాషకు నంద్యాల పార్లమెంట్ జిల్లా అధికార ప్రతినిధిగా బాధ్యతలు అప్పగించినట్లు టిడిపి వర్గాలు గురువారం తెలిపాయి. ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ ఆదేశాల మేరకు హుస్సేన్ బాషాకు జిల్లా అధికార ప్రతినిధి పదవి వరించినట్టు తెలిపారు. కౌన్సిలర్‌గా, టిడిపి ముఖ్య నేతగా భూమా కుటుంబానికి ప్రధాన అనుచరులుగా ఉంటూ వచ్చిన హుస్సేన్ బాషకు ఆళ్లగడ్డ నియోజకవర్గం నుంచి జిల్లా అధికార ప్రతినిధిగా నియమించినందుకు ఎమ్మెల్యే భూమా అఖిలప్రియకు హుస్సేన్ బాషా ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. హుస్సేన్ బాషా కుటుంబం దాదాపు 60ఏళ్ల నుంచి భూమా వర్గీయులుగా కొనసాగుతుంది. తండ్రి షరీఫ్ బాటలోనే తనయుడు హుస్సేన్ బాష కొనసాగుతున్నారు. కాగా హుస్సేన్ బాషకు పదవి రావడం పట్ల పార్టీ శ్రేణుల నుంచి అభిమానుల నుంచి ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి - ఆత్మకూరు

క్రిస్మస్ పర్వదినం వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. పట్టణంలోని ఇందిరానగర్, పలు చర్చిల దగ్గర క్రైస్తవ సోదరి సోదరులకు సిపిఎం సీనియర్ నాయకులు ఎ. రాజశేఖర్, పట్టణ కార్యదర్శి రణధీర్, నాయకులు రామ్ నాయక్, వీరన్నలు శుభాకాంక్షలు తెలిపారు. వారు మాట్లాడుతూ కుల మతాలకతీతంగా పరస్పరం ఆత్మీయంగా శుభాకాంక్షలు తెలుపుతూ ఉత్సాహంగా జరుపుకుంటారని తెలిపారు. హిందువులు సంక్రాంతి, ముస్లింలు రంజాన్, క్రైస్తవ సోదరులు క్రిస్మస్ పండగను ఎంతో ఆనందంగా జరుపుకోవడం మన సంస్కృతిలో భాగమన్నారు. ప్రేమ, దయ అనుబంధం ఆప్యాయత, స్నేహ శీలత్వాన్ని క్రిస్టమస్ వేడుకలు పెంపొందిస్తాయన్నారు. హిందూ, ముస్లిం, క్రైస్తవులు ఎవరైతేనేం మానవులే అని, ఈ జీవన సమరపు గమనంలో అలుపెరుగని యాత్రికులే అన్నారు. క్రిస్టియన్ సోదరులు జరిపే ప్రత్యేక ప్రార్థనలు సకల మానవాళికి ఉపయోగపడాలన్నారు. క్రిస్టియన్ సోదరులు సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.



ఆత్మకూరు

బనగానపల్లె : మండలంలో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని సిఎస్ఐ చర్చిలో చర్చి ఫాదర్ దేవదానం ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మదర్ థెరిసా చర్చిలో ఫాదర్ సూరి పోగుల ప్రకాష్ ఆధ్వర్యంలో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

నందికొట్కూరు టౌన్ : యేసుక్రీస్తు ప్రేమ, కరుణ, క్షమాగుణాలు ప్రజల జీవితాల్లో వెలుగు నింపాలని ఎమ్మెల్యే గిత్త జయసూర్య పేర్కొన్నారు. మండలంలోని బిజినవేముల ఆర్‌సిఎం చర్చిలో క్రిస్మస్ పండగ సందర్భంగా కుటుంబ సభ్యులతో కలిసి ప్రార్థనలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ యేసుక్రీస్తు ప్రేమ కరుణా క్షమాపణలు మన జీవితాల్లో వెలుగు నింపాలని ఆకాంక్షించారు. క్రిస్మస్ అనేది శాంతి సోదర తత్వం సేవా గుణాన్ని గుర్తుచేసే పర్వదినం అని పేర్కొన్నారు.

వెలుగోడు : మండలంలోని అన్నీ చర్చిల్లో క్రిస్మస్ పండగను క్రైస్తవులు ఘనంగా నిర్వహించారు. క్రిస్మస్ సందేశంతో ఆధ్యాత్మిక వాతావరణం ఉట్టి పడింది. చిన్నారు శాంటాతాత వేషధారణలు ఆకట్టుకున్నాయి. క్రిస్మస్ పండగ అందరి జీవితాల్లో శాంతి సుఖసంతోషాలు తీసుకురావాలని దైవ సన్నిధిలో దైవ సేవకులు ఆరాధించారు.

సంజామల : మండలంలోని అన్నీ చర్చిలలో క్రైస్తవులు పండగను ఆనందోత్సవాలతో ఘనంగా జరుపుకున్నారు. పిల్లలు పెద్దలు రంగులు చల్లుకుంటూ యేసు ప్రభువు అందరిని చల్లగా కాపాడుతాడని ఒకరినొకరు దీవించుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రార్థన చేసుకుంటూ రంగులు చల్లుకుంటూ క్రైస్తవులంతా క్రిస్మస్ పండగను ఘనంగా జరుపుకున్నారు.

కోవెలకుంట్ల : క్రైస్తవులకు క్రిస్మస్ పండగ మానవత్వమును ప్రేమను పంచే పండగని టిడిపి రాష్ట్ర కార్యదర్శి గడ్డం రామకృష్ణారెడ్డి అన్నారు. క్రైస్తవులందరూ సుఖసంతోషాలతో ఆనందంగా ఉండాలని ఏసుప్రభు క్రైస్తవులందరికీ ప్రేమ అనురాగం పంచాలని ఆకాంక్షించారు. క్రైస్తవులందరూ చర్చిలకు వెళ్లి ప్రార్థనలు చేశారని ఆయన తెలిపారు.



నందికొట్కూరు టౌన్

అవుకు : మండలంలో క్రిస్మస్ పర్వదిన వేడకలు ఘనంగా జరిగాయి. పట్టణంలోని పలు ప్రార్థన మందిరాల్లో క్రిస్మస్ సందర్భంగా ప్రార్థన మందిరాల్లో అర్ధరాత్రి నుండి ప్రార్థనలను కొనసాగించారు. వైయస్ఆర్సీపీ రాష్ట్ర లెజిస్లేటివ్ కౌన్సిల్ మెంబర్ చల్లా విగ్నేశ్వర్ రెడ్డి ఆర్సీఎం చర్చిలో క్రిస్మస్ వేడకల్లో పాల్గొని ప్రార్థనలను నిర్వహించారు. ఫాదర్ రవి సిస్టర్ దీప్తిల సమక్షంలో క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేసి ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు.

బేతంచర్ల : క్రిస్మస్ పండగను ఆయా చర్చిలలో క్రైస్తవులు వైభవంగా జరుపుకున్నారు. ఆయా చర్చిలలో హోసన్న పాస్టర్ సామ్యూల్, హెబ్రోన్ ఎరుషలేము ప్రార్థన మందిరం పాస్టర్ కుమార్, షాలెం చర్చి పాస్టర్ ప్రసాద్‌లు మాట్లాడుతూ నిన్నువలె నీ పొరుగు వారిని ప్రేమించవలెను అని ఏసుక్రీస్తు సెలవిచ్చినట్టుగా ప్రతి ఒక్కరూ జీవించాలని తెలిపారు. అనంతరం క్రిస్మస్ కేకులు కట్ చేసి కొవ్వొత్తులు వెలిగించి ప్రత్యేక ప్రార్థనలు గీతాలు ఆలపించారు.

రుద్రవరం : సర్వ మానవాళి రక్షణార్థమై క్రీస్తు పశువుల పాకలో జన్మించాడని సీఎస్ఐ రెవరెండ్ సురేష్ బాబు తెలిపారు. క్రిస్మస్ పండగ సందర్భంగా క్రైస్తవులు చర్చిలను విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించి ప్రత్యేక ప్రార్థనలను జరిపారు. రెవరెండ్ సురేష్ బాబు, రిటైర్డ్ రెవరెండ్ జాన్‌లు క్రిస్మస్ సందేశాన్ని బోధించారు. క్రీస్తు తన్నుతాను తగ్గించుకొని లోక రక్షకుడుగా పశువుల పాకలో జన్మించాడన్నారు. క్రిస్మస్ శుభాకాంక్షలు ఒకరికొకరు తెలుపుకొని కేకులను కట్ చేశారు.

సిరివెళ్ల : మండల పరిధిలోని బోయలకుంట్ల గ్రామంలోని సిఎస్ఐ చర్చిలో క్రైస్తవ సోదరులు ఏర్పాటు చేసిన క్రిస్మస్ వేడుకల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కనీస వేతనాల సలహా మండల డైరెక్టర్ కాటంరెడ్డి శ్రీకాంత్ రెడ్డి గారు పాల్గొన్నారు. అనంతరం గ్రామంలోని క్రైస్తవ సోదరులందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. క్రిస్మస్ ప్రపంచానికి ప్రేమ, శాంతి మానవత్వ సందేశాన్ని అందించే మహత్తర పండగ అని ఆయన అన్నారు. అనంతరం క్రీస్తు జన్మదినాన్ని పురస్కరించుకుని శ్రీకాంత్ రెడ్డి యువసేన ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ కేకును కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.



వెలుగోడు



బేతంచర్ల



రుద్రవరం



బనగానపల్లె

ఉర్దూ అకాడమీ బోర్డు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - నంద్యాల

ఉర్దూ అకాడమీ నియమావళి ప్రకారం బోర్డును తక్షణమే ఏర్పాటు చెయ్యాలని కార్వానే ఉర్దూ (ఉర్దూ సాహిత్య కమిటీ) జిల్లా కన్వీనర్ సి.అబ్దుల్ అజీజ్ మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూఖ్‌ను కోరారు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఉర్దూ అకాడమీ చైర్మన్‌గా ఫరూఖ్ షుబ్లి నియామకం రాష్ట్ర వ్యాప్తంగా ఉర్దూ భాషాభిమానులు, సాహితీవేత్తలు, మేధావుల్లో అపారమైన ఆశాభావాన్ని కలిగించిందని ఆయన తెలిపారు. ఆయన గురువారం మీడియాతో మాట్లాడుతూ ఈ కీలక నిర్ణయం తీసుకున్న ఉర్దూ భాష ప్రియుడు మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎమ్‌డి ఫరూఖ్ దూరదృష్టికి ఉర్దూ సమాజం కృతజ్ఞతలు తెలియజేస్తోందన్నారు. ఇదే సమయంలో ఉర్దూ అకాడమీ స్థాపనకు 50ఏళ్ల పూర్తైన సందర్భంగా 'సురూర్-ఏ-ఉర్దూ మహోత్సవ్' పేరిట రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న వేడుకలు ఉర్దూ భాషా సాహిత్యాల పట్ల ప్రభుత్వ నిబద్ధతను చాటుతున్నాయని తెలిపారు. ఉర్దూ సాహిత్య కమిటీ కార్వానె ఉర్దూ తరుపున ప్రభుత్వం దృష్టికి ఒక కీలకమైన చట్టబద్ధమైన డిమాండ్‌ను తీసుకు వస్తున్నామన్నారు. ఉర్దూ అకాడమీ నియమావళి 1975లోని రూల్4 (కన్స్టిట్యూషన్ ఆఫ్ ది బోర్డు ఆఫ్ గవర్నర్స్) ప్రకారం, అకాడమీ నిర్వహణ మొత్తం బోర్డ్ ఆఫ్ గవర్నర్స్‌కు చెందుతుందని తెలిపారు. అదేవిధంగా రూల్9 (పవర్స్ అండ్ ఫంక్షన్స్ ఆఫ్ ది బోర్డు ఆఫ్ గవర్నర్స్) ప్రకారం అకాడమీ లక్ష్యాల అమలు, పరిపాలన విధాన నిర్ణయాలు అన్నీ బోర్డు ద్వారానే జరగాల్సి ఉంటుందన్నారు. అంతేకాకుండా రూల్5 (డైరెక్టర్ ఆఫ్ ది అకాడమీ) ప్రకారం చైర్మన్‌తోపాటు బోర్డు ఉనికిలోనే డైరెక్టర్/సెక్రటరీ విధులు చట్టబద్ధంగా అమలవుతాయన్నారు. బోర్డు లేకుండా చైర్మన్ తీసుకునే నిర్ణయాలకు సంపూర్ణ చట్టబద్ధత ఉండదన్నారు. అందువల్ల ఉర్దూ అకాడమీ నియమావళి 1975లోని రూల్-4, రూల్-9లకు అనుగుణంగా ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఉర్దూ అకాడమీకి సంబంధించిన బోర్డ్ ఆఫ్ గవర్నర్స్‌ను తక్షణమే నామినేట్ చేసి కార్యాచరణలోకి తీసుకురావాలని మంత్రిని కోరారు. ఈ నెల 29న విజయవాడలో నిర్వహించనున్న ఉర్దూ మహోత్సవంలో రాష్ట్ర ప్రభుత్వ లోగోలో ఆంగ్ల, తెలుగు భాషలతోపాటు ఉర్దూ భాష నమోదు చేసి రాష్ట్ర ప్రభుత్వ లోగో ఆవిష్కరించాలని అబ్దుల్ అజీజ్ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రిని కోరారు.



క్రిస్మస్ వేడుకల్లో ఎపిపి

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ :

యేసుక్రీస్తు జననం వెనుక ఉన్న అసలు సందేశాన్ని గ్రహించినట్లైతే ప్రేమ, త్యాగం, మానవత్వం వంటి విలువలు ఈ ప్రపంచానికి ఎంత అవసరమో ఆయన తన బోధనలో స్పష్టంగా చెప్పారని ఆళ్లగడ్డ 5వ జిల్లా కోర్టు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బత్తిని శివ ప్రసాదరావు తెలిపారు. మండలంలోని బత్తలూరు గ్రామంలో గురువారం న్యాయవాది అవుకు వెంకటయ్య స్వగృహంలో క్రిస్మస్ పండగను పురస్కరించుకొని వెంకటయ్య ఆహ్వానం మేరకు ఆయన హాజరు అయ్యారు. కేక్ కట్ చేసి ఘనంగా క్రిస్మస్ వేడుకలు జరుపుకున్నారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది రమణయ్యతోపాటు న్యాయవాదులు సుబ్బయ్య, తోట నరసయ్య, గోపు శ్రీనివాసులు, లక్ష్మి నరహరి, తిరుపాల్ రెడ్డి, వెంకట ప్రసాద్, రఘురాం రెడ్డిలు ఆయనకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.

జనసేన కార్యాలయంలో క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

క్రిస్మస్ పర్వదినం సందర్భంగా ఆళ్లగడ్డ జనసేన పార్టీ కార్యాలయంలో తాలూకా జనసేన నాయకులు ఇరిగెల రాంపుల్లారెడ్డి సోదరులు ఇరిగెల సూర్యనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో గురువారం కేక్ కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. తాలూకా ఎస్సీ సెల్ నాయకులు డాలు రత్నమయ్య మాట్లాడుతూ యేసుక్రీస్తు జన్మదినాన్ని పురస్కరించుకుని దేశంలోని ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని ప్రేమ కరుణ ద్వారా ప్రపంచ మానవాళిలో ఆనందం నింపిన యేసుక్రీస్తు జీవితం అందరికీ ఆదర్శప్రాయన్నారు. కూటమి ప్రభుత్వంలో క్రిస్టియన్ పాస్టర్లకు క్రిస్మస్ కానుకను అందించడం జరిగిందన్నారు. రాష్ట్రంలో 8,418 మంది పాస్టర్లకు గౌరవ వేతనం నిధులు విడుదల చేయడం జరిగిందని ఇచ్చిన మాట ప్రకారం నిధులు విడుదల చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రాయలసీమ జోన్ కమిటీ సభ్యులు మాబు హుస్సేన్, రంగస్వామి, సజ్జల నాగేంద్ర, దూదేకుల బాబు, సాదక్, అబ్దుల్ పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న నాయకులు

నందివర్గం ఎస్ఐగా బత్తుల భూపాలుడు

ప్రజాశక్తి - బనగానపల్లె

బనగానపల్లె మండలం నందివర్గం ఎస్ఐగా బత్తుల భూపాలుడును అధికారులు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ ఎస్ఐగా పని చేస్తున్న వెంకటసుబ్బయ్యను నంద్యాల సిసిఎస్‌కు బదిలీ చేశారు. రేవనూరు ఎస్ఐగా పని చేస్తున్న బత్తుల భూపాలుడును నందివర్గం ఎస్ఐగా అధికారులు బదిలీ చేశారు. త్వరలో నూతన ఎస్ఐగా ఆయన బాధ్యతలు చేపట్టనున్నారు.

అవుకు ఎస్ఐ రాజారెడ్డి బదిలీ

ప్రజాశక్తి - అవుకు :

అవుకు పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ రాజారెడ్డి ప్రభుత్వ ఆదేశానుసారం గురువారం ఉత్తర్వులు జారీ అయినట్లు ఆయన తెలిపారు. ఆయన అణుకు స్టేషన్లో రెండేళ్లుగా విధులు నిర్వహించి ప్రజాభిమానం పొందారు. ఉన్నతాధికారులు రాజారెడ్డిని నంద్యాల త్రీ టౌన్‌కు బదిలీ చేసినట్లు ఆయన తెలిపారు. అవుకు పోలీస్ స్టేషన్కు ఇంకా కొత్తవారిని ఎవరిని నియమించకపోవడంతో మండలంలో ఆసక్తి నెలకొంది.

టిడిపి జిల్లా వైస్ ప్రెసిడెంట్‌గా కల్లూరి శకుంతలమ్మ

ప్రజాశక్తి - సిరివెళ్ల



మండల పరిధిలోని కోటపాడు గ్రామానికి చెందిన మాజీ సర్పంచి కల్లూరి శకుంతలమ్మను నంద్యాల జిల్లా వైస్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు అప్పగించినట్లు టిడిపి వర్గాలు గురువారం ఒక ప్రకటనలో తెలిపాయి. ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ ఆదేశాల మేరకు కల్లూరి శకుంతలమ్మను జిల్లా వైస్ ప్రెసిడెంట్ పదవి వరించినట్లు తెలిపారు. మాజీ సర్పంచిగా టిడిపి మహిళా నేతగా భూమా కుటుంబానికి ప్రధాన అనుచరులుగా ఉంటూ వచ్చిన కల్లూరి చేశా ఓబుల రెడ్డి సతీమణి మాజీ సర్పంచి కల్లూరి శకుంతలమ్మకు ఆళ్లగడ్డ నియోజకవర్గం నుండి జిల్లా వైస్ ప్రెసిడెంట్‌గా నియమించినందుకు ఎమ్మెల్యే భూమ అఖిలప్రియకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఎస్ఐకి జనసేన, టిడిపి ఘన సన్మానం

ప్రజాశక్తి - రుద్రవరం





రుద్రవరం మండలం ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన జయప్పను నంద్యాల జిల్లా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి టిడిపి నాయకుడు కొమ్మలపాటి రాజారావు మర్యాదపూర్వకంగా కలిశారు. గురువారం రుద్రవరం పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఎస్ఐ జయప్పను శాలువా పూలమాలతో సన్మానించారు. నాయకులు మాట్లాడుతూ పోలీస్ డిపార్ట్మెంట్‌కు శాంతిభద్రతల పరిరక్షణలో తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. అలాగే.. జనసేన నాయకులు, హ్యూమన్ రైట్స్ నాయకులు ఎస్ఐను ఘనంగా సన్మానించారు. జనసేన మండల ఇన్‌ఛార్జీ, మండల గౌడ సంఘం అధ్యక్షులు నాగ లింగమయ్య గౌడు, హ్యూమన్ రైట్స్ మండల అధ్యక్షులు చంటి ఓబయ్య, నాయకులు మాదం బన్నీ, జనార్ధన మర్యాదపూర్వకంగా కలిసి శాలువ పూలమాలలతో సన్మానించారు. శాంతి భద్రతల పరిరక్షణకు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు.

అప్పలరాజును వెంటనే విడుదల చేయాలి

- ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ



అనకాపల్లి జిల్లా, ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అప్పలరాజుపై పెట్టిన పిడి యాక్ట్‌ను ఉపసంహరించుకొని వెంటనే విడుదల చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్, జిల్లా కార్యదర్శి రామచంద్రుడు ప్రభుత్వాన్ని గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. హోం శాఖ మంత్రి నియోజకవర్గంలో బల్క్ డ్రగ్ ఫ్యాక్టరీ కోసం రైతుల భూములను నిర్ధాక్షణంగా ప్రభుత్వం లాగేసుకోవడాన్ని వ్యతిరేకిస్తూ ఉద్యమాలు నిర్వహించిన ఉద్యమ నేతపై పిడి యాక్ట్ పెట్టి అరెస్టు చేయడం దుర్మార్గమన్నారు. ఈ సంఘటనను రాష్ట్రంలో ఉన్న ప్రతి ఒక్కరూ ఖండించాలని వారు కోరారు.

బుక్కరాయల నాటి రాగి పలక శాసనం గుర్తింపు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

రామగిరి మండలం నసనకోట గ్రామంలో ఉన్న విజయనగర సామ్రాజ్య చక్రవర్తి సంగమవంశానికి చెందిన మొదటి బుక్కరాయల రాగి పలక శాసనాన్ని చరిత్రకారుడు మైనాస్వామి గుర్తించారు. చరిత్ర అధ్యాపకుడు డాక్టర్ ప్రతాప్ ఆహ్వానం మేరకు గురువారం పరిశోధకుడు శ్రీధర్ తో కలిసి నసనకోటలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాలివాహన శకవర్షం 1273 నందన నామ సంవత్సరం వైశాఖ బహుళ ద్వాదశి అంటే సామాన్య శకం 1352 మేలో నసన గ్రామం, పరిసర గ్రామాలకు 'గౌడ', 'దేశి గౌడ' అనే గ్రామాధికారులను నియమిస్తూ చక్రవర్తి బుక్కరాయలు రాగిపలక శాసనాన్ని రాయించారన్నారు. గుత్తి రాజ్యం పాలెజ స్థలం కనగానపల్లె పరిధిలోని నసన గ్రామం గౌడగా కొడిద కాపు చోడమరెడ్డిని రాజు నియమించినట్లు శాసనంలో ఉందన్నారు. పేరూరు, కుంటిమద్ది, కొమర గుండు,భైరవునితిప్ప, ముష్టి కోవెల, వల్లూరు,వకజంక, కేతగానిచర్ల, వరగెర, తిరుమణి, బల్ల సముద్రం తదితర గ్రామాలకు 'దేశి గౌడ'లను గ్రామాధికారులుగా పేర్కొంటూ వారందరికీ పెద్ద గౌడగా పెద్ద చోడమరెడ్డిని నియమించినట్టు ఈ శాసనం చెబుతోందని మైనాస్వామి వివరించారు. కనగానపల్లి. సనప ప్రాంతాలను పరిపాలన చేయడానికి గ్రామాధికారులు, గ్రామాల వృత్తి పనివారి వివరాలు, వారికి కేటాయించిన భూములు గల ఊర్ల సరిహద్దులు వంటి విషయాలను అందులో పేర్కొన్నారన్నారు. గ్రామ పాలకుల పేర్లతోపాటు గణికుల పేర్లను కూడా శాసనంలో ప్రస్తావించడం నాటి పాలనా పద్ధతులకు అద్దం పడుతోందని చరిత్రకారుడు తెలిపారు. పౌరోహితుడు మాడుగుల తిమ్మయ్య, గణికుడు నందవరం తిమ్మయ్య, మరో గణికుడు కన్నడ రామయ్య, తలారికాడు రాముడు, విశ్వకర్మ, కుమ్మరి,రజక వంటి గ్రామ వృత్తికారులకు రాజు బుక్కరాయలు భూమిని దానంగా ఇచినట్లు శాసనం చెబుతోందన్నారు. ప్రతి గ్రామాధికారి గౌడ పెద్దచోడమ రెడ్డి చెప్పినట్టు నడుచుకోవాలని రాజు అందులో ఆదేశించాడన్నారు. రాగి పలక ముందు భాగంలో సూర్యుడు- చంద్రుడు, చక్రము- శంఖం, తిరునామాలు, యజ్ఞవాటిక వెనుక భాగంలో కింది వైపున నాగలి గుర్తులు ఉన్నాయని ఆయన తెలియజేశారు. పెన్నా నది పరిసర గ్రామాల భూములను దానం చేయడం, కాలువల ద్వారా పెన్న నీటిని మళ్లించి వ్యవసాయ అభివృద్ధికి విజయనగర పాలకులు ఎంతగానో పాటుపడినట్టు శాసనం ద్వారా తెలుస్తోందన్నారు. నసనకోట గ్రామదేవత దుర్గమ్మ వార్షిక ఉత్సవాల సమయంలో రాగి పలకను గుడిలో ఉంచి పూజ చేస్తామని రాగి పలక శాసనాన్ని పరిరక్షిస్తున్న మారక భాస్కరరెడ్డి చెప్పారు. మాడుగుల ఆత్రేయ శర్మ, గంగాధర్, పూజారి ఎర్రప రెడ్డి, సుధాకర్ తదితరులు దుర్గమ్మ గుడిని సందర్శించిన వారిలో ఉన్నారు.

నేడు ప్రజాదర్బార్

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

ప్రజా సమస్యల పరిష్కారం కోసం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఉదయం 11 గంటలకు బుక్కపట్నం, పుట్టపర్తి, కొత్తచెరువు మండలాలతో పాటు పుట్టపర్తి మున్సిపాలిటీకి చెందిన ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఎమ్మెల్యే పల్లెసింధూర రెడ్డి ఆధ్వర్యంలో ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు పుట్టపర్తి పట్టణ టీడీపీ కన్వీనర్ బోయ రామాంజనేయులు తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రతి శుక్రవారం ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ప్రజా గ్రీవెన్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు ఈ ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని కొత్తచెరువు, పుట్టపర్తి, బుక్కపట్నం మండలాల ప్రజలతో పాటు పుట్టపర్తి మున్సిపాలిటీ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. పుట్టపర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పల్లె సింధూర, మాజీమంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి ఏర్పాటు చేసిన ప్రజా దర్బార్ కు ఈ మూడు మండలాలకు సంబంధించిన రెవిన్యూ ,పోలీస్ ,వ్యవసాయ ,విద్యుత్ ,పశు శవర్ధక ,గ్రామీణాభివృద్ధి ,గ్రామీణ తాగునీటి సరఫరా, వైద్యం , మెప్మా, డీఆర్డీ డీప వెలుగు , ఐసీడీఎస్, పంచాయతీరాజ్ ,ఆర్ అండ్ బి ,అటవీశాఖ, ఆర్టీసీ, ఉపాధి హామీతోపాటు మిగతా అన్ని శాఖల ప్రభుత్వ అధికారులు ప్రజాప్రతినిధులు కూటమి పార్టీల నాయకులు హాజరు కావాలని ఆయన కోరారు.

శక్తి యాప్‌పై అవగాహన

ప్రజాశక్తి - కదిరి అర్బన్

సెక్యూరిటీ విభాగం ఆధ్వర్యంలో శక్తి యాప్‌పై కేజీబీవీ పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఇటీవలి కాలంలో మహిళలు, బాలికలపై జరుగుతున్న అఘాయిత్యాలు, సైబర్ నేరాలు, పోక్సో కేసుల నేపథ్యంలో విద్యార్థినులు అప్రమత్తంగా ఉండాలన్నారు. తమ భద్రత తమ చేతుల్లోనే ఉందని అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. మహిళల రక్షణకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న భద్రతా చర్యలపై విస్తృతంగా వివరించారు. ప్రతి విద్యార్థిని తన మొబైల్ ఫోన్‌లో శక్తి యాప్‌ను తప్పనిసరిగా డౌన్లోడ్ చేసుకోవాలని, ప్రమాద పరిస్థితుల్లో ఒక్క క్లిక్‌తోనే పోలీసుల సహాయాన్ని కోరవచ్చని వివరించారు. శక్తి యాప్ ద్వారా మహిళలు తమ లొకేషన్‌ను వెంటనే పోలీసులకు షేర్ చేయవచ్చని, ఇది మహిళల భద్రతకు అత్యంత ఉపయోగకరమైన సాధనమని తెలిపారు. ఈ కార్యక్రమంలో శక్తి టీమ్ పీసీ ఎస్. చలపతి, షౌకత్ ఖాన్ పాల్గొన్నారు.

సిఐటియు జాతీయ మహాసభలను జయప్రదం చేయండి



కరపత్రాలను పంపిణీ చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి - తలుపుల

ఈనెల 31వ తేదీ నుండి జనవరి 4వ తేదీ వరకు విశాఖపట్నంలో జరుగుతున్న సిఐటియు ఆల్ ఇండియా మహాసభలను జయప్రదం చేయాలని సిఐటియు నాయకులు కోరారు. ఈ మేరకు మండల కేంద్రంలో పంచాయతీ కార్మికుల సంఘం ఆధ్వర్యంలో కరపత్రాలను సిఐటియు నాయకులు విడుదల చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సిఐటియు ఆలిండియా మహాసభలు ఆంధ్ర రాష్ట్రంలో మొదటిసారిగా జరుగుతున్నాయని చెప్పారు. ఈ మహాసభలలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక ,ప్రజావ్యతిరేక విధానాలపై చర్చించి భవిష్యత్తు కార్యాచరణ రూపొందిస్తామని చెప్పారు. ప్రధానంగా కేంద్ర ప్రభుత్వం దేశంలోని కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్స్‌లను రద్దు చేయాలని, దేశంలోని కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని, తీర్మానాలు చేయబోతున్నామన్నారు. జనవరి 4వ తేదీన విశాఖపట్నం మున్సిపల్ గ్రౌండ్ లో లక్షలాది మంది కార్మికులతో ర్యాలీ బహిరంగ సభ జరుగుతుందని ఈ మహాసభల జయప్రదం కోసం తలుపుల మండలంలోని కార్మికులు,ఉద్యోగులు, ప్రజలు సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి బి సాంబశివ, మండల కన్వీనర్ భాష, నారాయణ, అరుణ, గంగమ్మ, శివమ్మ, అశోక్, చిన్న దొడ్డప్ప, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

చిలమత్తూరు : ఈనెల 31 నుంచి జనవరి 4 వరకు విశాఖపట్నంలో జరిగే సిఐటియు అఖిల భారత మహాసభలను జయప్రదం చేయాలని సిఐటియు నాయకులు రామచంద్ర పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం మండల పరిధిలోని కోడూరు టెక్స్ పోర్ట్ సిండికేట్ గార్మెంట్స్ లో కార్మికులకు కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు మాట్లాడుతూ కార్పొరేట్లకు మేలు చేసేందుకు, కార్మిక వర్గం హక్కులను హరించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూనుకున్నాయని విమర్శించారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా బలమైన కార్మిక ఉద్యమాన్ని నిర్మించడంలో సిఐటియు అగ్రభాగాన నిలిచిందని తెలిపారు. కార్మికులకు పిఎఫ్, ఇఎస్ఐ అమలు చేయాలని, గ్రాడ్యుటీ అమలు చేయాలని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు అమలు చేయాలని, 8 గంటల పని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఫిరంగి ప్రవీణ్, మంజు, భూమా రెడ్డి, నారాయణప్ప, అంజి, రాధిక, రజియమ్మ, శేఖర, ఆవులప్ప తదితరులు పాల్గొన్నారు.

వైన్ షాపులో చోరీ

మద్యం, నగదు అపహరణ



షాపులో స్టాకును పరిశీలిస్తున్న అధికారులు

ప్రజాశక్తి-హిందూపురం

మద్యం దొంగతనాన్నే లక్ష్యంగా చేసుకొని సినీ ఫక్కిలో పక్క ప్రణాళిక ప్రకారం చోరీకి పాల్పడిన సంఘటన చోటుచేసుకుంది. ప్రధాన రహదారికి పక్కనే ఉన్న మద్యం దుకాణంలో చోరీ జరగడం పట్ల స్థానికులు తీవ్రభయాందోళనకు గురవుతున్నారు. వైన్ షాప్ ముందు సిమెంట్ రాళ్లు వేసి వాటిపై దుప్పట్లు కప్పి వాచ్ మెన్ నిద్రిస్తున్నట్టుగా రూపకల్పన చేశాడు. ఇంకేముంది షట్టర్ ఓపెన్ చేసి రూ. 30 వేల విలువ చేసే మద్యం, క్యాష్ కౌంటర్ లో ఉన్న రూ.40వేల నగదు దోచుకెళ్లాడు. ఈ సంఘటన శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురం పట్టణం ప్రధాన సర్కిల్ లోని సూర్య వైన్ షాపులో బుధవారం అర్ధరాత్రి జరిగిన సంఘటన. ఉదయం వైన్ షాప్ వద్దకు వెళ్లిన మేనేజర్ షాప్ ముందు దుప్పటి కప్పుకొని ఎవరు పడుకున్నారని వెళ్లి చూసి రాళ్లు ఉండడంతో ఒక్కసారిగా షాక్ గురయ్యాడు. దొంగతనం జరిగిందని గుర్తించి వెంటనే ఎక్సైజ్ అధికారులకు సమాచారం అందించారు. వైన్ షాప్ దగ్గరకు వెళ్లిన అధికారులు సిసి ఫుటేజ్ ద్వారా చోరీ జరిగిన విధానాన్ని గుర్తించి సంఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అనారోగ్యంతో వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి-రొద్దం

అనారోగ్య సమస్యలతో ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన గురువారం మండల కేంద్రమైన రొద్దంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. రొద్దంలో నివాసం ఉంటున్న నాగార్జున(38) వృత్తి రీత్యా స్థానిక వెంకటేశ్వరస్వామి ఆలయం పక్కనే బార్బర్ షాపు నిర్వాహిస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. అతడు కొన్ని రోజులుగా కాలేయ సంబంధిత జబ్బుతో బాధ పడేవాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెందిన ఉదయం అద్దెకు ఉంటున్న ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతనికి భార్య, ఇద్దరు కుమార్తెలు, 20 రోజుల కుమారుడు ఉన్నారు. కుటుంబానికి పెద్దదిక్కు, ఆధారమైన అతడి మృతితో వారు శోకసముద్రంలో మునిగిపోయారు.

మోటార్ల మెకానిక్ దుకాణంలో చోరీ

ప్రజాశక్తి - బత్తలపల్లి

బత్తలపల్లిలోని అనంతపురం రోడ్డుకు గల మోటార్ల మెకానిక్ దుకాణంలో గుర్తు. తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. బాధితుడు దాసరి సాయి సతీష్ (మాధవయ్య చిట్టి) తెలిపిన సమాచారం మేరకు.. బత్తలపల్లిలోని అనంతపురం రోడ్డుకు గత మూడు సంవత్సరాలుగా మెకానిక్ దుకాణం ఏర్పాటు చేసుకున్నారు. యధావిధిగా బుధవారం పనులు ముగించుకుని దుకాణానికి తాళాలు వేసి ఇంటికి వెళ్లారు. గురువారం దుకాణం తలుపులు తెరవడానికి వెళ్లగా అప్పటికే తలుపుల కీళ్ల పగులుకొట్టిఉండటాన్ని దాసరి సాయి సతీష్ గుర్తించాడు. దుకాణంలో మోటార్ల మరమ్మతులకు తెచ్చిన రూ.30వేలు విలువైన కొత్త వైరు, పాత వైరు, గన్ మెటల్ ఎత్తుకెళ్లినట్లు బాధితుడు తెలిపారు. దీనిపై బత్తలపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సాయి సతీష్ చెప్పారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - కదిరి టౌన్

కదిరి పట్టణం కుటాగుళ్ల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందాడు. మండలంలోని కాలసముద్రం గ్రామానికి చెందిన నాగరాజు తలుపుల మండలానికి చెందిన శివశంకర్ కదిరి నుంచి ద్విచక్రవాహనంలో వెళుతుండగా కుటాగుళ్ల వద్ద ఎదురుగా వస్తున్న వీరి ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో కాలసముద్రానికి చెందిన నాగరాజు అక్కడికక్కడే మృతిచెందాడు. తీవ్రంగా గాయపడిన శివశంకర్‌ను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



జగన్‌తో మాట్లాడుతున్న అన్సార్

వైఎస్ జగన్‌ను కలిసిన వైసిపి నాయకులు

ప్రజాశక్తి-హిందూపురం

వైసిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని చిలమత్తూరు మండలానికి చెందిన వైసిపి నాయకులు కలిశారు. గురువారం బెంగళూరులోని జక్కురు విమానాశ్రయంలో వైసిపి మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి అన్సర్ అహ్మద్, సీనియర్ నాయకులు మొరసలపల్లి అమర్నాథ్ రెడ్డి జగన్ కలిసి పలు అంశాలపై చర్చించారు. ప్రధానంగా రైతులకు సంబంధించిన భూముల బలవంతపు సేకరణపై జగన్‌కు నాయకులు వివరించారు.

మృతుని కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి - కొత్త చెరువు

మండల పరిధిలోని తలమర్ల కు చెందిన ఎమ్మెల్యే గన్ మెన్ భాస్కర్ రెడ్డి తండ్రి తమటం ఓబుల్ రెడ్డి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పల్లె సింధూర గురువారం గ్రామానికి వెళ్లి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతునికుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ ఒలిపి శ్రీనివాసులు, మండల కన్వీనర్ రామకృష్ణ ,టీడీపీ సీనియర్ నాయకులు ఎస్ శ్రీనివాసులు, కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ముక్కోటి ఏకాదశి ఏర్పాట్ల పరిశీలన

ప్రజాశక్తి - కదిరి అర్బన్

ఈనెల 30వ తేదీ జరగనున్న ముక్కోటి ఏకాదశి సందర్భంగా చేస్తున్న ఏర్పాట్లను గురువారం జిల్లా ఎస్పీ సతీష్ పరిశీలించారు. స్వామి వారి దర్శనానికి వస్తున్న భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు లేకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. క్యూలైన్లో ఏర్పాట్లు ఇతర అంశాలను ఆలయ ఈవో శ్రీనివాస్ రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పోలీస్ భద్రత కట్టుదిట్టంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో దేవాలయ సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

వినియోగదారుల సేవలకు అవార్డు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

వినియోగదారుల ఉత్తమ సేవలకు గుర్తింపుగా పుట్టపర్తికి చెందిన వినియోగదారుల సంఘాల సమాఖ్య ప్రధాన కార్యదర్శి జి సురేష్ కుమార్ అవార్డు అందుకున్నారు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం జాతీయ వినియోగదారుల దినోత్సవం బుధవారం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఘనంగా నిర్వహించారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీషా అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర సివిల్ సప్లైస్ మేనేజింగ్ డైరెక్టర్ ఢిల్లీ రావు, రాష్ట్ర సివిల్ సప్లై డైరెక్టర్ ఆర్ గోవిందరావు , లీగల్ మెట్రాలజీ జాయింట్ కంట్రోలర్ కష్ణ చైతన్య పాల్గొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వినియోగదారుల సంఘాలలో ఉత్తమ సంఘాలకు రాష్ట్ర వినియోగదారుల వ్యవహారాల, పౌరసరఫరా శాఖ మేనేజింగ్ డైరెక్టర్ ఢిల్లీ రావు చేతుల మీదుగా రాష్ట్రస్థాయి ఉత్తమ అవార్డులు అందజేశారు. అందులో భాగంగా తాను ఈ అవార్డును అందుకున్నట్లు పుట్టపర్తికి చెందిన వినియోగదారుల సంఘాల సమాఖ్య ప్రధాన కార్యదర్శి జి సురేష్ కుమార్ తెలిపారు.



అవార్డు అందుకుంటున్న సురేష్‌కుమార్

బలిజల రాజకీయ ఎదుగుదలకు తోడ్పాటు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - కదిరి టౌన్

కదిరి నియోజకవర్గంలోని బలిజలకు గతంలో ఇచ్చిన హామీ ప్రకారం తొందరలోనే కళ్యాణ మండపం పనులు ప్రారంభిస్తామని అలాగే శ్రీ కష్ణదేవరాయల విగ్రహాన్ని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేస్తామని ఎమ్మెల్యే కంది కుంట వెంకట ప్రసాద్ స్పష్టం చేశారు. గురువారం కదిరి పట్టణ బలిజ సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన 2026 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎమ్మెల్యే కంది కుంట చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తన రాజకీయ ఎదుగుదలకు బలిజలు తోడ్పాటు అందించారని వారి సహకారం గుర్తుంచుకుంటానని చెప్పారు. ఈ కార్యక్రమంలో బలిజ సంఘం అధ్యక్షులు జనసేన పార్టీ నాయకులు మార్కెట్ యార్డ్ చైర్మన్ అనసూయ చౌదరి. ఆ సంఘం నాయకులు మాజీ కౌన్సిలర్ కునక పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, తదితరులు

అనంత మార్కెట్‌ను అభివృద్ధి చేయండి

నూతన ఛైర్మన్ బల్లా పల్లవికి ఎమ్మెల్యే సూచన

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అనంతపురం మార్కెట్ యార్డ్‌ను అభివృద్ధి పతంలో ముందుకు తీసుకెళ్లాలని నూతన ఛైర్‌పర్సన్ బల్లా పల్లవికి ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సూచించారు. అనంతపురం మార్కెట్ యార్డ్ ఛైర్‌పర్సన్‌గా నియమితులైన బల్లా పల్లవి ఆమె భర్త బల్లా సురేష్‌లు గురువారం నాడు అర్బన్ కార్యాలయంలో ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి భారీ గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మార్కెట్ యార్డ్ ద్వారా రైతులకు విశేష సేవలు అందించాలన్నారు. రైతులకు సేవ చేసే అవకాశం ఛైర్మన్ ద్వారా రావడానిన అదృష్టంగా భావించాలన్నారు. రైతులు అన్ని రకాల పంట ఉత్పత్తులను అమ్ముకునే విధంగా అన్ని ఏర్పాట్లు యార్డులో చేయాలన్నారు. మార్కెట్‌యార్డు ఛైర్మన్ బల్లా పల్లవి మాట్లాడుతూ తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా యార్డు అభివృద్ధికి పనిచేస్తానన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతో ముందుకెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు సరిపుటి రమణ, మణికంఠ బాబు, నారాయణస్వామి యాదవ్, లక్ష్మీనాయుడమ్మ, పులబాషా తదితరులు పాల్గొన్నారు.



మార్కెట్‌యార్డు ఛైర్మన్ బల్లా పల్లవి, ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌కు గజమాలతో అభిమానుల సన్మానం

వినియోగదారులకు మెరుగైన సేవలు

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

స్థానిక కె హెచ్. ప్రభుత్వ డిగ్రీకళాశాలలో జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని గురువారం విద్యార్థుల మధ్య ఘనంగా నిర్వహించారు. వాణిజ్య శాస్త్ర విభాగాధిపతి యం. పుష్పావతి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె. ప్రభాకర్ రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డా కె ప్రభాకర్ రెడ్డి వినియోగదారుల చట్టాల గురించి, వినియోగదారుల హక్కుల గురించి, విభాగాలు, ఫోరమ్స్ పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం నిర్వహించిన క్విజ్ పోటీల్లో ప్రతిభ కనపర్చిన వారికి బహుమతులు ప్రదానం చేశారు.

టిడిపి అధికార ప్రతినిధి గా ముతుకూరు బీబీ

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

టిడిపి జిల్లా తెలుగుదేశం పార్టీ అనుబంధ కమిటీలని పార్టీ అధిష్టానం ప్రకటించింది. ఇందులో భాగంగా ధర్మవరం పట్టణానికి చెందిన ముత్తుకూరు బీబీని జిల్లా అధికార ప్రతినిధిగా నియమించారు. ఈసందర్భంగా బీబీ పరిటాల శ్రీరామ్ కి కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు



క్రిస్మస్ వేడుకల్లో మంత్రి సవిత



క్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్యే కందికుంట



ఓడిసిలో క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి-పెనుకొండ

సమాజంలో ఐక్యత, ప్రేమ, సోదర భావాలు పెరగాలని రాష్ట్ర బీసీ సంక్షేమ చేనేత జౌళి శాఖల మంత్రి సవిత ఆకాంక్షించారు. క్రిస్మస్ సందర్భంగా గురువారం పెనుగొండ సిఐజి చర్చిలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరై మంత్రి సవిత క్రిస్మస్ కేక్ కట్ చేసి అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ సమాజంలో మనుషుల మధ్య ఐక్యత, ప్రేమ, సోదర భావాలు పెరగాలన్నారు. అందరూ సంతోషంగా జీవించాలని ఆకాంక్షిం చారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, చర్చి ఫాథర్లు తదితరులు పాల్గొన్నారు.

గుడిబండ : మండల వ్యాప్తంగా వివిధ గ్రామాల్లో క్రైస్తవులు గురువారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరుపుకొన్నారు. బుధవారం అర్ధరాత్రి నుంచే చర్చిలకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కేక్ కట్ చేసి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. బంధువులు, స్నేహితులు, శ్రేయోభిలాషులకు విందు ఏర్పాటు చేశారు.

మడకశిర రూరల్ : మడకశిరలోని అన్ని ప్రార్థనా మందిరాల్లో భక్తిశ్రద్ధలతో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. క్రైస్తవులు ప్రార్థనా మందిరాల్లో జరిగిన కార్యక్రమాలకు హాజరై ఒకరికొకరు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. పలువురు ప్రముఖులు క్రైస్తవులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.

కొత్తచెరువు : మండల వ్యాప్తంగా క్రిస్మస్ పండుగను క్రైస్తవ సోదరులు గురువారం ఘనంగా నిర్వహించుకున్నారు. కొత్త చెరువులోనే అన్ని చర్చిలలోనూ రంగురంగుల విద్యుత్‌దీపాలతో అలంకరించి. పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

నంబులపూలకుంట :మండల పరిధిలోని టిఎన్ పల్లి, నంబులపూలకుంట, ధనియా చెరువు, వెలచెలమల గ్రామాలలో గురువారం క్రిస్మస్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజలు పాస్టర్లు పాల్గొన్నారు.

బత్తలపల్లి : క్రిస్మస్ సందర్భంగా గురువారం మండలంలోని అన్ని చర్చిలలో ప్రార్థనలు చేశారు. మండలంలోని అన్ని చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. వివిధ గ్రామాలకు చెందిన క్రిష్టియన్లు బత్తలపల్లికి చేరుకుని చర్చిలలో ప్రార్థనలు చేశారు. మండల కేంద్రంలోని చర్చి ఆఫ్ క్రిస్ట్ ఫామ్రాజన్, ఎస్ఈఎఫ్ చర్చిలో ఫౌల్, భక్తిసింగ్ చర్చిలో చంద్రరాజ్, ఇమానుయల్ చర్చిలో సుదర్శన్, బేతనీయ ప్రార్థనామందరంలో ప్రతాప్, రివైవాల్ చర్చిలో రూపాసుహాసిణి, ఇందిరమ్మ కాలనీలో డేనియల్. విజయ్‌కుమార్ ఫాస్టర్లు ఇచ్చిన సందేశాలను ఆలకించారు. అదే విధంగా ఆర్టీటీ ఆసుపత్రిలో క్రిస్మస్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. అనంతరం చిన్నారులచే నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ఓబుళదేవర చెరువు : మండల కేంద్రంలోని సి అండ్ ఐ జి మిషన్ చర్చితో పాటు పలు చర్చిలలో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. క్రిస్మస్ విశిష్టతను పాస్టర్ రెవరెండ్ డాక్టర్ ఎంజి జయనందం వివరించారు. ఈ కార్యక్రమంలో చర్చి కార్యదర్శి దార్ల రాజశేఖర్, చర్చి సీనియర్ సభ్యురాలు టి ఎం భారతి, సభ్యులు కె.బాలరాజు, సునీల్ కుమార్, ప్రభు కుమార్, అశీర్వాదమ్మ, తదితరులు పాల్గొన్నారు.

తలుపుల : మండల పరిధిలోని కుర్లి పంచాయతీ సిద్దుగురి పల్లిలోనిసి అండ్ ఐ జి చర్చ్ నందు నిర్వహించిన క్రిస్మస్ వేడుకలలో తలుపుల మండల కన్వీనర్ డికే బాబు పాల్గొని, ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కుర్లీ శివారెడ్డి, ఆవుల వివేకానంద రెడ్డి, ఉత్త రెడ్డి, మౌలా, హిదాయతుల్లా, తులసి తదితరులు పాల్గొన్నారు.

గాండ్లపెంట : మండలంలో గురువారం క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పాస్టర్లు ఆయా చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

ధర్మవరం రూరల్ : పట్టణంలోని రైల్వే స్టేషన్లో సెయింట్ ఆంధ్రు కేథలిక్ చర్చిలో గురువారం క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ఫాదర్ ఆంథోనీ రాజ్ ఆధ్వర్యంలో సాంప్రదాయ పద్ధతిలో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమంలో వందల సంఖ్యలో క్రైస్తవులు పాల్గొన్నారు.

కదిరి అర్బన్ : కదిరి పట్టణం టవర్ క్లాక్ దగ్గర ఉన్న సీ ఐ జీ యం మిషన్ చర్చ్ లో జరిగిన క్రిస్మస్ వేడుకలలో ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పాల్గొన్నారు. తనకు మతాల కన్నా మనుషులపైనే అభిమానం ప్రేమ ఎక్కువ అని అందువల్లనే ఒక ప్రజాప్రతినిధిగా అన్ని మతాలను కలుపుకొని వారికి ఉన్న సమస్యల తొలగింపులనకు సౌకర్యాలు కల్పించడమే ధ్యేయంగా పనిచేస్తానని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ తెలిపారు. క్రిస్టియన్స్ మత పెద్దలు చేసిన ప్రార్థనలో ఆయన పాల్గొన్నారు.

హిందూపురం : హిందూపురం పట్టణ, పరిసర ప్రాంతాల్లో ని చర్చిలో గురువారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని సీ అండ్ ఐ జి మిషన్ చర్చి, సీ అండ్ ఐ జి కాంపౌండ్ చర్చి తదితర చర్చిల్లో క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. స్థానిక సీ అండ్ ఐ జి మిషన్ చర్చిలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ డిఈ రమేష్ కుమార్, ఎం.ఎల్.ఏ. వ్యక్తిగత కార్యదర్శులు పావులూరి శ్రీనివాసురావు, వీరయ్య, బాలాజీ, సీనియర్ టిడిపి నాయకులు గ్రీన్ పార్క్ నాగరాజు, టిడిపి పట్టణ అధ్యక్షులు ప్రెస్ వెంకటేష్, టిడిపి నాయకులు నాగరమోదా శివ, బేకరి గంగాధర్, ఎన్ బి కే రాజు, సుమో సీనా తదితరులు పాల్గొన్నారు.